జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | శుక్రవారం 14 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :211 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,



**WANTED**

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967



శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## స్వయం సహాయక సంఘాలకు

# గుడ్ న్యూస్



- 10 మంది నిబంధన సడలింపు
- 8 మంది సభ్యులున్నా రిపీట్ డోస్ లబ్ధి
- బ్యాంక్‌కు మంత్రి కొండపల్లి అభినందనలు

**అమరావతి**

స్వయం సహాయక సంఘాల మహిళలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సభ్యుల మరణం లేదా వలసల వల్ల ఒక సంఘంలో సభ్యుల సంఖ్య 10 కంటే తగ్గితే, ఆ సంఘాలు ఎంత బాగా పనిచేసినా తదుపరి రుణ సదుపాయం (రిపీట్ డోస్) పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని... ఈ క్రమంలోనే ఏపీ గ్రామీణ బ్యాంక్ తమ అంతర్గత ఉత్తర్వులు నెంబర్ 152 ద్వారా ప్రత్యేక సడలింపులు ప్రకటించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. అలాగే - మిగతా3లో



## ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఒక జోకర్ల గుంపు

- అప్పటి వరకు వారిని నిద్రపోనివ్వం: రాహుల్ ఘాటు విమర్శలు
- అధికార పార్టీకి భిన్నంగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమన్న కాంగ్రెస్ అగ్రనేత
- ఆర్ఎస్ఎస్ నాయకులకు ప్రస్తుత భారతదేశంపై ఎలాంటి అవగాహన లేదని రాహుల్ వ్యాఖ్య
- ఆర్ఎస్ఎస్ బడా పెట్టుబడిదారుల చేతుల్లో సాధనంగా మారిపోయిందని విమర్శ

## అమరావతి నిర్మాణంలో

# మొదటి మెట్టు

- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్
- రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయం పరిశీలన



**అమరావతి**

సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాభివద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ -- మంగళగిరి -- గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ--3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సీఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం-- పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్టైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ... 'రాష్ట్రాభివద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ - మిగతా3లో

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు

- ప్రత్యేక కోర్టులతోనే అన్నీ పరిష్కారం!: జస్టిస్ సూర్యకాంత్
- ప్రతి కేసుకు ఒకే కాలపరిమితి సాధ్యం కాదన్న సీజేఐ
- ప్రత్యేక కోర్టులు, టైమ్ బౌండ్ ట్రయల్స్‌తో పెండింగ్ కేసుల పరిష్కారం జరుగుతుందన్న జస్టిస్ సూర్యకాంత్





## పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు

- నినాదాల మధ్య ఉభయసభలు నిరవధిక వాయిదా
- చివరి రోజూ కొనసాగిన అధికార, విపక్షాల నిరసనలు
- లోక్‌సభలో వందేమాతరం గీతం అనంతరం సైన్ డై ప్రకటించిన స్పీకర్
- రాహుల్‌ను బీజేపీ టార్గెట్- కోతి బొమ్మతో కాంగ్రెస్ నిరసన

## ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత




- కుంకీ ఏనుగుల రాకతో ఏపీలో అద్భుత ఫలితాలు
- రాష్ట్రంలో ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు
- అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**విశాఖపట్నం**

'ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. నేను అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల బాధ్యతలను - మిగతా3లో

# చంద్రబాబు అరాచక పాలన

- ఇదేమి రాజ్యం.. బాధితులే నిందితులు
- శాశ్వతంగా మీరు అధికారంలో ఉండరు మూల్యం చెల్లించుకుంటారు
- జైలు లోపల నన్ను అవమానించారు
- వెన్నుపోటు పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే విరూపాక్ష అరెస్ట్ అధికార దుర్వినియోగానికి నిదర్శనం
- కర్నూలు జైల్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షితో వైయస్ జగన్ ములాఖత్



**కర్నూలు**

రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసు వ్యవస్థ సర్వనాశనం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుది అని నిత్యం వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారనిరాష్ట్రంలో చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బాధితులనే నిందితులుగా మార్చడం, దాడికి గురైన వారిపైనే కేసులు పెట్టడం, బాధితులకు అండగా నిలిచిన వారిని అరెస్ట్ చేయడం రాష్ట్రంలో పరిపాటిగా మారిందన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యే ఇంటిపై అర్ధరాత్రి వందలాది మంది పోలీసులతో దాడి చేసి, తలుపులు పగులగొట్టి అరెస్ట్ చేయడం ఇందుకు పరాకాష్ట అని పేర్కొన్నారు. కర్నూలు జైల్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షితో ములాఖత్ అనంతరం వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. - మిగతా3లో



## చైనా ముప్పు'ను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో అభివృద్ధి మంత్రం

- సరిహద్దు గ్రామాల్ని దేశపు తొలి గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- జెమితాంగ్‌లో రోడ్లు, విద్యుత్, వైద్యం, పర్యటకంతో మారుతున్న పరిస్థితులు
- మౌలిక వసతులున్నా ఉపాధి లేక ఖాళీ!

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!

- సీఈఓ పోస్టు కోసం 5,585 దరఖాస్తులు
- సీఈఓ ఎంపిక కోసం సెర్చ్ కమిటీ ఇంటర్వ్యూలు
- ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు
- పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం



# పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు



జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గందరగోళం మధ్య ముగిశాయి. గురువారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాల ముగింపు కూడా అధికార, విపక్షాల మధ్య తీవ్ర రాజకీయ ఘర్షణకు వేదికగా మారింది. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద బీజేపీ, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే జాతీయ గీతం వందేమాతరంలోని మొత్తం 6 చరణాలను ఆలపించారు. ఆ వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా సమావేశాలు ముగిసే రోజున సభ పనితీరును, ఉత్పాదకతను వివరిస్తూ స్పీకర్ చేసే ముగింపు ప్రసంగం ఈసారి జరగలేదు. సభ వాయిదా పడిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో కొద్దిసేపు ఉన్నారు.

ఝార్ఖండ్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ పార్టీ స్పందించడం లేదంటూ బీజేపీ నేతలు ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ మకర్ ద్వార్ వద్ద బీజేపీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. ప్రజా సమస్యలపై విపక్షం బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండగా, సభా కార్యకలాపాలను అడ్డుకోవడానికే ప్రాధాన్యం ఇస్తోందని అధికార పక్షం విమర్శించింది. బీజేపీ నిరసనకు కొద్దిసేపటికే విపక్ష ఎంపీలు కూడా అక్కడే ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేడా నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో ఓ బొమ్మ కోతిని ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. '56 అంగుళాల చిన్న కోతి లోపలికి రా' అంటూ చేసిన నినాదాలు రాజకీయంగా వివాదానికి దారితీశాయి. అధికార పక్ష నేతలు ఈ నిరసన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**'సభ నడపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే'**

సభ సజావుగా సాగకపోవడానికి విపక్షాన్ని నిందించడం సరికాదని ప్రతిపక్షాలు ఎంపీలు అన్నారు. పార్లమెంట్‌ను నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ ఎంపీ సౌగత రాయ్ అని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన వినేందుకు విపక్షం సిద్ధంగా లేదన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఝార్ఖండ్ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరామని, ఎవరి ఆదేశాలతో పెల్లెట్ గన్ కాల్పులు జరిగాయో చెప్పాలని డిమాండ్ చేశామని తెలిపారు. కానీ ప్రభుత్వం నుంచి సరైన వివరణ రాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా కూడా సభ వాషౌట్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. గత 20 రోజులుగా పార్లమెంట్‌లో ఉండి సమస్యలపై చర్చకు ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశాలు ముగియడానికి చివరి రోజు మాత్రమే కేంద్ర హోంమంత్రి చర్చకు సిద్ధమని చెప్పడం వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీశారు.

**విపక్షమే సభను అడ్డుకుందని బీజేపీ ఆరోపణ**

మరోవైపు అధికార పక్షం కూడా విపక్ష ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనే సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ, పార్లమెంటరీ వ్యవస్థ ప్రకారం సభ నడుస్తుందని, దానిని ఎవరి వ్యక్తిగత వ్యవహారంలా మార్చలేరని అన్నారు. రాహుల్ గాంధీ తన రాజకీయ ప్రభావంతో వరుసగా కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి రాజీనామా చేయాల్సి వస్తుందని భావించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు వ్యవస్థ ప్రకారమే జరుగుతాయని చెప్పారు.

**వరుస అంతరాయాలతోనే సమావేశాలు**

ఈసారి వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభలో తరచూ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. అధికార, విపక్షాల ఆందోళనలతో సభలు దద్దరిల్లాయి. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్, అయోధ్య విరాళాల చోరీ వంటి అంశాలపై నిరసిస్తూ ప్రతిపక్షాలు సభను అడ్డుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులపై లాఠీచార్జ్ ఘటనపై హోంమంత్రి అమిత్ షా జవాబు చెప్పాలని విపక్షాలు చేసిన డిమాండ్ సభను కుదిపేసింది. మరోవైపు ఝార్ఖండ్ నిరసనలపై రాహుల్ గాంధీ స్పందించాలంటూ బీజేపీ ఎంపీలు నిరసనలు చేశారు. సభ లోపలే కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలోనూ ఇరు పక్షాలు పరస్పర నిరసనలకు దిగాయి. చివరి రోజు కూడా అదే పరిస్థితి కొనసాగడంతో సభలు నిరవధిక వాయిదా వేశారు. దీంతో చర్చలు, రాజకీయ ఆరోపణలు, నిరసనల మధ్య సాగిన వర్షాకాల సమావేశాలకు అధికారికంగా తెరపడింది. అయితే గురువారం చివరిరోజు కావడంతో అమిత్‌షా ఈ అంశంపై సమాధానం చెబుతారని అంతా భావించారు. ఆయన కూడా విపక్షాల ప్రతీ ప్రశ్నకూ సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు బుధవారం ప్రకటించారు. అందుకు సమయం కేటాయించాలని స్పీకర్‌ను సైతం కోరారు. అయినప్పటికీ, సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

# ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఒక జోకర్ల గుంపు




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బీజేపీపై గురువారం విరుచుకుపడ్డారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్?కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనలను ప్రభుత్వం అణచివేసిన తీరుపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ బాధను వ్యక్తం చేయాలని విద్యార్థులు అనుకుంటుంటే, ఆ ప్రభుత్వం మాత్రం నిబంధనల పేరుతో వారి గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని అధికార పక్షం కేవలం కొద్దిమంది వ్యక్తులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే విధంగా దేశంపై ఒక కఠినమైన వ్యవస్థను బలవంతంగా రుద్దడమే వారి రాజకీయ తత్వమని దుయ్యబట్టారు. గురువారం దిల్లీలో జరిగిన 'రచనాత్మక కాంగ్రెస్ జాతీయ సదస్సు'లో ఆయన మాట్లాడారు.

**అధికార పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ సిద్ధాంతం**

అయితే, అధికార పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ సిద్ధాంతం ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశ ప్రజలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న నిబంధనలను కాంగ్రెస్ పార్టీ బద్దలు కొడుతుందని వ్యాఖ్యానించారు. నాలుగేళ్ల క్రితం ఉత్తరాఖండ్‌లో అత్యాచారానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఓ యువతి తల్లి తనను కలిసి కన్నీరు పెట్టుకుందని రాహుల్ గుర్తుచేసుకున్నారు. బాధితురాలు తన ఆవేదనను వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తుంటే, ప్రస్తుత వ్యవస్థ మాత్రం ఆమెను మాట్లాడనివ్వడం లేదు మండిపడ్డారు. ఆమె మాట్లాడితే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని అంటున్నారు. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ దౌత్య విధానంపై రాహుల్? తీవ్ర విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ నాయకులను కౌగిలించుకోవడం కాకుండా దేశ ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ పని అని హితవు పలికారు. కేవలం స్నేహం, బహిరంగ ఆత్మీయ ప్రదర్శనలపై ఆధారపడకుండా, అంతర్జాతీయ సంబంధాలకు జాతీయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలిపారు.

"కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు కలిసి తమ గళాన్ని వినిపించడం ప్రారంభించాయి. ఇక దీన్ని ఎవరూ ఆపలేరు. నరేంద్ర మోదీ రాజీనామా చేసి, అమిత్ షా పదవి నుంచి తప్పుకునే వరకు మేం వదిలిపెట్టం. చివరికి వారు 'మమ్మల్ని క్షమించండి, మమ్మల్ని వదిలేయండి' అని అంగీకరించి చేతులెత్తేసే వరకు మేం వారిని నిద్రపోనివ్వం. అయితే, ఇదంతా ద్వేషం, హింస లేకుండా ప్రజాస్వామ్య బద్ధంగానే ఎదుర్కొంటాం. దేశ విలువలు, సంస్కృతి కోసం మావంతు ఈ పోరాటం చేస్తున్నాం. మన దేశం, ఆప్యాయత, ప్రేమ, సోదరభావం, అహింస కలిగిన దేశం. ఈ విషయాన్ని మేం అందరికీ నిరూపిస్తాం."

**ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ కీలక వ్యాఖ్యలు**

మరోవైప, రాష్ట్రీయ స్వయం సేవక్? సంఘ్?(ఆర్ఎస్ఎస్)పై కూడా రాహుల్? ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆర్?ఎస్?ఎస్? నాయకులకు ప్రస్తుత భారతదేశంపై ఎలాంటి అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గతంలో మనం బ్రిటిష్ సామ్రాజ్యంతో పోరాడామని, కానీ ప్రస్తుతం మనం పోరాడుతున్నది మన దేశ చరిత్ర, సిద్ధాంతాలపై కనీస అవగాహన లేని కొందరు జోకర్లతో అని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని అర్థం చేసుకోవాలంటే 3,000 ఏళ్ల నాటి విషయాలు కాదు, ప్రస్తుత భారతదేశాన్ని, ఇక్కడి ప్రజల భావాలను అర్థం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. ఒకప్పుడు ఆర్ఎస్ఎస్ అంటే దేశంలోని చిన్న వ్యాపారులు, స్వర్ణకారులు, నగల వ్యాపారులకు ప్రాతినిధ్యం వహించారని రాహుల్ పేర్కొన్నారు. కానీ ఆ కాలం నాటి ఆర్ఎస్ఎస్ ఎప్పుడో కనుమరుగు అయిపోయిందని అన్నారు. ప్రస్తుత ఆర్ఎస్ఎస్ పూర్తిగా రూపాంతరం చెంది పెద్ద పెద్ద కార్పొరేట్ శక్తులు, బడా పెట్టుబడిదారుల చేతుల్లో ఒక సాధనంగా మారిపోయిందని ఆరోపించారు. చేతుల్లో కర్రలు పట్టుకుని తిరుగుతూ వారు తమను తాము హాస్యాస్పదంగా మార్చుకుంటున్నారని దుయ్యబట్టారు.

# 'చైనా ముప్పు'ను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో అభివృద్ధి మంత్రం

సరిహద్దు గ్రామాలు అంటే ఒకప్పుడు దేశ పటంలో చివరి అంచున ఉన్న ప్రాంతాలుగానే చూసేవారు. అక్కడికి రోడ్డు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక వసతులు చేరడమే పెద్ద సవాలుగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. దేశ సరిహద్దులోని గ్రామాల్ని చివరి గ్రామాలుగా కాకుండా, దేశపు తొలి గ్రామాలుగా చూడాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల్ని చేపడుతోంది. కానీ సరిహద్దు గ్రామాలకు రోడ్లు, భవనాలు, విద్యుత్ అందిస్తేనే అక్కడి ప్రజలు ఆగిపోతారా? ఉపాధి లేకపోతే యువత తిరిగి నగరాలవైపు వెళ్లిపోరా? ఈ ప్రశ్నలకు అరుణాచల్ ప్రదేశ్‌లోని రెండు సరిహద్దు ప్రాంతాలు రెండు భిన్నమైన సమాధానాల్ని చూపిస్తున్నాయి. ఒకవైపు అభివృద్ధితో మారుతున్న తవాంగ్ జిల్లాలోని జెమితాంగ్; మరోవైపు మౌలిక వసతులు ఉన్నా ప్రజల వలసలతో వెలవెలబోతున్న లిమేకింగ్ తక్సింగ్.

చైనాతో అత్యంత సున్నితమైన సరిహద్దును పంచుకుంటున్న అరుణాచల్ ప్రదేశ్‌లో స్థానికుల వలసల్ని అడ్డుకోవడం, సరిహద్దు గ్రామాల్ని మౌలిక వసతులతో బలోపేతం చేయడం, వాటిని ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చడం, లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్‌లో 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్ (ఎవూ)' ను ప్రారంభించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా– అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల 'కిబిథూ' గ్రామం నుంచి ఈ కార్యక్రమాన్ని లాంఛ్ చేశారు. 2026 ఫిబ్రవరి 20న అసోంలోని సరిహద్దు గ్రామం నుంచి రెండో విడతను కూడా విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవం వేళ అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లోని 'జెమితాంగ్', 'లిమేకింగ్– తక్సింగ్' గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందో ఈటీవీ భారత్ అందిస్తున్న ప్రత్యేక కథనం. అరుణాచల్ ప్రదేశ్ దేశంలోనే అత్యంత కీలకమైన సరిహద్దు రాష్ట్రం. ఇది చైనాతో సుమారుగా 1080 నుంచి 1200 కిలోమీటర్ల మేర సరిహద్దును (మెక్ మోహన్ లైన్) పంచుకుంటోంది. చైనా ఎప్పటికప్పుడు అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు తమవేనని, దానిని దక్షిణ టిబెట్ అని పిలుస్తూ వివాదాలు సృష్టిస్తూ ఉంటుంది. అయితే భారత్ మాత్రం చైనా బెదిరింపుల్ని తిప్పికొడుతూ, అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలోని అంతర్భాగమేనని స్పష్టం చేస్తోంది. చైనా ఆక్రమణల్ని అడ్డుకోవాలంటే సైన్యంతో పాటు సరిహద్దు గ్రామాల్లో ప్రజలు నివసించడం కూడా చాలా ముఖ్యం. అందుకే సరిహద్దు గ్రామాల్ని ఖాళీ కాకుండా చూడటం కూడా భద్రతా వ్యూహంలో భాగంగా మారింది.

**జెమితాంగ్ సక్సెస్ స్టోరీ**

పశ్చిమ అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లాలో ఉన్న జెమితాంగ్ గ్రామం చైనా సరిహద్దుకు చాలా దగ్గరగా ఉంటుంది. ఇక్కడ భారత్ చేపట్టిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. వైబ్రెంట్ విలేజెస్ పథకం కింద ఇక్కడ అద్భుతమైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా ఇక్కడ రవాణా వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు ఆర్మీ పోస్టులకు లేదా వేరే ఊళ్లకు వెళ్లాలంటే గంటల తరబడి కొండల్లో నడవాల్సి వచ్చేది. ఇంకా ప్రాణాలకు తెగించి ప్రమాదకరమైన వంతెనలు దాటాల్సి ఉండేది. కానీ ఇప్పుడు చూస్తే వాహనాలు నేరుగా చివరి ప్రాంతం వరకు వెళు_న్నాయి. రోడ్లు, విద్యుత్, తాగునీరు, వైద్యం వంటి సదుపాయాలు అందుబాటులోకి రావడంతో రోజువారీ జీవితం కూడా సులభమైంది. ఇక్కడ భారత సైన్యం కేవలం సరిహద్దు కాపలాకే పరిమితం కాలేదు. ఆపరేషన్ సద్భావ్ కింద ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, తాగునీటి సదుపాయాలు కూడా కల్పిస్తోంది. ఐటీబీపీ బలగాలు ప్రజలతో పాటు వారి పశువులకు కూడా వైద్యం అందిస్తున్నాయి. ప్రసిద్ధ గొర్సమ్ చోర్టెన్ స్థూపం, జెమితాంగ్ లోయ అందాలు పర్యటకుల్ని ఆకట్టుకుంటున్నాయి. స్థానిక మహిళలు 'కొమోస్ కేఫ్' పేరుతో కేఫ్ నిర్వహిస్తూ తమకంటూ ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. ఈసారి ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా స్టాల్స్ కూడా ఏర్పాటు చేసి మోమోస్, నూడుల్స్, చోమిన్, రాగులతో చేసిన పదార్థాల్ని కూడా అమ్మడానికి సిద్ధమవుతున్నారు. ఏటా జరిగే గొర్సమ్ ఉత్సవం సైన్యానికి, స్థానిక ప్రజలకు మధ్య అనుబంధాన్ని మరింత పెంచుతోంది.

**మేకింగ్– తక్సింగ్‌లో మరో పరిస్థితి!**

జెమితాంగ్‌లో అభివృద్ధి కనిపిస్తుంటే తూర్పున ఉన్న అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని లిమేకింగ్ – తక్సింగ్ ప్రాంతం మాత్రం మరో వాస్తవాన్ని చూపిస్తోంది. ఇక్కడ స్వాతంత్ర్య దినోత్సవం సందడి కాస్త తగ్గింది. ఒకప్పుడు ఆగస్ట్ 15 వస్తే ఇక్కడ పండగ వాతావరణం ఉండేది. బ్యాండ్ మేళాలు, ఆటల పోటీలు, పరేడ్‌లు కూడా జరిగేవి. సైనికులు, అధికారులు, ఊరి జనమంతా ఉత్సాహంగా పాల్గొనేవారు. కానీ ఇప్పుడు అక్కడ జనం పెద్దగా లేక ఉత్సాహం కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో ఇంకా 3 మిడిల్ స్కూళ్లు, 11 ప్రైమరీ స్కూళ్లు, కమ్యూనిటీ హాళ్లు, బ్యాడ్మింటన్ కోర్టులు ఉన్నాయి. కానీ వాటిని ఉపయోగించే ప్రజల సంఖ్య తగ్గిపోతోంది. చదువు, ఉద్యోగాల కోసం యువత గ్రామాల్ని వదిలి వెళ్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోసం పూర్తిస్థాయి ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు రాగా, అందులో మొదటిగా 16 మందిని సెర్చ్ కమిటీ షార్ట్‌లిస్ట్ చేసింది. ఇప్పుడు ఆ పదహారు మంది నుంచి ముగ్గురి పేర్లను ఎంపిక చేసి, సెర్చ్ కమిటీ తమకు పంపుతుందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. "షార్ట్ లిస్ట్ చేసిన పదహారు మంది అభ్యర్థుల పనితీరును సమీక్షించి, సెర్చ్ కమిటీ ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఆ అభ్యర్థుల జాబితాను తగిన సమయంలో ట్రస్టుకు తెలియజేస్తుంది. దీనిపై ట్రస్ట్ తుది నిర్ణయాన్ని ప్రకటిస్తుంది" అని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది.

**ఇంటర్వ్యూలు**

రిటైర్డ్ జస్టిస్ పర్మోద్ కోహ్లీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వీకే చతుర్వేది, అణుశాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ హవ్రేలతో కూడిన సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రాంగణంలో ఆగస్టు 11, 12 తేదీల్లో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సెర్చ్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం, సీఈఓ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,877 మంది అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన కవర్ లెటర్స్ (సీవీ) సమర్పించారు. నమొదటి దశలో నిర్వహణ సామర్థ్యం, భారీ స్థాయి కార్యక్రమాలను, సిబ్బందిని నిర్వహించడంలో అనుభవం, వ్యక్తిగత నైపుణ్యం, భాషా ప్రావీణ్యం, భవిష్యత్తు దృక్పథం, వ్యూహాత్మక ప్రణాళిక వంటి అంశాల ఆధారంగా అభ్యర్థులను వడపోశారు. రెండో దశలో అభ్యర్థులు సమర్పించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సుమారు 111 మంది అభ్యర్థులను ఆన్?లైన్?లో ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. వారి కమ్యునికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన అనుభవం, దృక్పథం, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను ఇందులో అంచనా వేశారు. మూడో దశలో ముఖాముఖి ఇంటర్వ్యూల కోసం 16 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ ఫైనలిస్టుల్లో ఆర్మీలో పనిచేసిన మాజీ సైనికులు, పదవీ విరమణ చేసిన ఐఏఎస్, ఐపీఎస్? అధికారులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసిన నిపుణులు సహా విభిన్న నేపథ్యాలకు చెందిన నిష్ణాతులున్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన సంస్థకు ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పారదర్శకంగా ఎంపిక చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని కమిటీ పేర్కొంది.

**మూడేళ్ల కాంట్రాక్ట్**

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు. పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం ఉంది. అయితే ఈ పదవికి సంబంధించిన జీతం, ఇతర ప్రయోజనాలను చర్చల ద్వారా నిర్ణయిస్తారు. ట్రస్ట్ ప్రత్యక్ష నిర్వహణలో పనిచేస్తూ, సీఈఓ పరిపాలన బాధ్యతలు నిర్వహిస్తారు. ఆర్థిక విషయాల్లో పారదర్శకతను పాటిస్తారు. ప్రభుత్వ ఏజెన్సీలతో భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేస్తారు. మతపరమైన ఆచారాలు, పండుగలను పర్యవేక్షిస్తారు. భక్తుల భద్రతను, సౌకర్యాలను చూసుకుంటారు. విశిష్ట అతిథుల కోసం ఏర్పాట్లు చేస్తారు. ట్రస్ట్ రోజువారీ కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాలు చోరీకి గురయ్యాయని, కానుకల నిర్వహణలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వహణ కోసం ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ)ను నియమించాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక ప్రక్రియ చేపట్టింది. కాగా, అయోధ్య రామమందిర విరాళాల చోరీపై జూన్?లో ఎఫ్?ఐఆర్? నమోదైంది. ఇప్పటి వరకు ఈ కేసులో కనీసం 8 మందిని అరెస్టు చేశారు.

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు

దేశవ్యాప్తంగా పెరుగుతున్న కేసుల పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కోర్టులు, కాలపరిమితితో కూడిన విచారణలు అవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అయితే అన్ని రకాల కేసులకు ఒకే కాలపరిమితిని నిర్ణయించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కేసుల స్వభావాన్ని బట్టి తగిన సమయాన్ని నిర్ణయించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ పలు కీలక అంశాలపై మాట్లాడారు.

**ప్రతి కేసుకూ ఒకే గడువు కాదు**

దేశంలోని న్యాయస్థానాల్లో కేసుల పెండింగ్ కొనసాగుతుండటం పెద్ద సవాలేనని సీజేఐ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నుంచి జిల్లా, సెషన్స్ కోర్టుల వరకు ఈ సమస్య ఉందన్నారు. న్యాయవ్యవస్థలో ఇప్పటికే అనేక మార్పులు వచ్చినప్పటికీ ప్రతి కేసు నిర్ణీత సమయంలో త్వరగా పరిష్కారం కావాలన్న ప్రజల ఆకాంక్ష సమంజసమేనని చెప్పారు. అయితే ప్రతి కేసుకు ఒకే కాలపరిమితిని వర్తింపజేయడం సాధ్యం కాదన్నారు. కేసుల స్వభావం, సంక్లిష్టత, అంశాల ఆధారంగా విచారణకు అవసరమైన సమయం మారుతుందని వివరించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల ఆధారంగా కేసులకు తగిన కాలపరిమితులను నిర్ణయిస్తామని తెలిపారు.

**ప్రత్యేక కోర్టులతో వేగవంతమైన తీర్పులు**

కేసుల పరిష్కారంలో ప్రత్యేక కోర్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీజేఐ అన్నారు. ప్రభుత్వ సహకారంతో తీవ్రమైన నేరాలకు సంబంధించిన విచారణల కోసం ఏడాది వ్యవధిలోనే ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయగలిగామని చెప్పారు. వివాహ, కుటుంబ వివాదాల కోసం ఫ్యామిలీ కోర్టులు, వాణిజ్య వివాదాల కోసం కమర్షియల్ కోర్టులు, వివిధ అంశాలపై ప్రత్యేక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకే రకమైన కేసులను ఆయా అంశాల్లో నైపుణ్యం కలిగిన న్యాయస్థానాలు విచారిస్తే వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. భిన్న రకాల కేసులను ఆయా రంగాల్లో నిపుణత కలిగిన కోర్టులు నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**న్యాయమూర్తుల సంఖ్య పెరగాలి**

కేసుల పెండింగ్‌ను పూర్తిగా తగ్గించడంలో న్యాయవ్యవస్థ ఇంకా పూర్తి విజయం సాధించలేదని సీజేఐ అంగీకరించారు. న్యాయమూర్తుల నియామకాలు, ముఖ్యంగా జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన అవసరం వంటి అంశాలు దీనికి కారణమని చెప్పారు. తాను సీజేఐగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కేసుల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే 'డాకెట్ మేనేజ్‌మెంట్'పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా భారీ ప్రభావం చూపే, అత్యంత కీలకమైన కేసులను ముందుగా పరిష్కరించే విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ ధర్మాసనాల ఏర్పాటు, ఒకే తరహా కేసులను సమూహాలుగా విచారించడం ద్వారా పెండింగ్‌ను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

**న్యాయమూర్తికి సహాయకారిగానే!**

న్యాయవ్యవస్థలో సాంకేతికత వినియోగాన్ని పెంచుతున్నప్పటికీ అది న్యాయమూర్తి స్థానాన్ని భర్తీ చేయకూడదని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయాధికారులు యాంత్రికంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి రాకూడదన్నారు. టెక్నాలజీని న్యాయమూర్తికి సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగించాలి తప్ప సాంకేతికతే తీర్పు చెప్పే స్థాయికి వెళ్లకూడదని పేర్కొన్నారు. రాష్ట్రాలు లేదా నిర్దిష్ట ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే విధానంపైనా సీజేఐ స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రభావం చూపే అంశాలను సుప్రీంకోర్టు విచారించవచ్చని కానీ ఒక రాష్ట్రం లేదా నిర్దిష్ట ప్రాంతానికి సంబంధించిన అంశాలను ముందుగా సంబంధిత హైకోర్టు ముందు ఉంచాలని సూచించారు. భారత రాజ్యాంగంలో హైకోర్టులకు అత్యంత కీలకమైన స్థానం ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు, ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు రాజ్యాంగపరమైన అధికారాలు ఉన్నాయని వివరించారు. కొన్ని అంశాల్లో ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు ఉన్న అధికార పరిధి ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు ఉన్న పరిధి కంటే విస్తృతంగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు న్యాయం వారి ప్రాంతానికి దగ్గరగా అందాలనే ఉద్దేశంతోనే ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఉండేలా రాజ్యాంగ నిర్మాతలు వ్యవస్థను రూపొందించారని సీజేఐ అన్నారు. జిల్లా కోర్టులో పరిష్కరించాల్సిన కేసు జిల్లా కోర్టుకే, హైకోర్టుకు సంబంధించిన కేసు హైకోర్టుకే, సుప్రీంకోర్టుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టుకే వెళ్లేలా రాజ్యాంగ వ్యవస్థను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.

# డీఎస్సీ అవకతవకలపై ప్రశ్నిస్తే అరెస్టులా? వై సీ పి రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు

--మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ
--20 లక్షల ఉద్యోగాల హామీతో యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
--విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి
--పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని వైసీపీ శ్రేణులపై అక్రమ కేసులు
--జగన్ నాయకత్వంలో యువతకు న్యాయం జరిగే వరకు పోరాటం...




**కాకినాడ జిల్లా ఆగస్టు 13(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** డీఎస్సీ అవకతవకలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం దారుణమని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు మండిపడ్డారు.ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.మెగా డీఎస్సీ పేరుతో యువతను మోసం చేశారని, ఇది మెగా డీఎస్సీ కాదని.. దగా డీఎస్సీ అని మురళీకృష్ణంరాజు విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం..కేవలం 16 వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన డీఎస్సీలోనూ భారీగా అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు.డీఎస్సీలో యువతకు అన్యాయం జరిగిందని,దీనిపై వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుంటే వైసీపీ శ్రేణులను రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.యువతకు న్యాయం జరిగే వరకు వైసీపీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు పోలీసు వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఉపయోగించుకుంటోందని మురళీకృష్ణంరాజు ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తరహాలో డీఎస్సీ అవకతవకలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని మురళీకృష్ణంరాజు డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం కొనసాగుతుందని ముదునూరి మురళీకృష్ణంరాజు స్పష్టం చేశారు.

# విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నాము

## ఎ ఐ యస్ యఫ్ జిల్లా అధ్యక్షురాలు యామిని దేవిశ్రీ.




**పాలకొల్లు. ప్రజాజ్యోతి. ఆగస్టు 13.**విద్యార్థుల సమస్యలపై ఎ ఐ యస్ యఫ్ నిరంతరం దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నదని, విద్యార్థుల్లో విద్య, చైతన్యం, పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు యామిని దేవిశ్రీ తెలిపారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో విద్యార్థిని, విద్యార్థుల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు యామిని దేవిశ్రీ అధ్యక్షత వహించగా ఎ ఐ యస్ యఫ్ పట్టణ కార్యదర్శి నెక్కంటి క్రాంతి కుమార్ ఎ ఐ యస్ యఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎ ఐ యస్ యఫ్ మాజీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణతో, పోరాట స్ఫూర్తితో ముందుకు నడిపించే చైతన్యాన్ని ఎ ఐ యస్ యఫ్ మాత్రమే అందిస్తున్నదని తెలిపారు.అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు పి. పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం పోరాడే ఏకైక విద్యార్థి సంఘంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య నిలుస్తున్నదని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎ ఐ యస్ యఫ్ జిల్లా కార్యదర్శి సి. హెచ్. సుందర్ కుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎ ఐ యస్ పెద్ద పాత్ర పోషించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆగస్టు 10, 11 తేదీల్లో నిర్వహించిన క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించిన ఎ ఐ యస్ యఫ్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం అధ్యక్షులు డి. సాయి కుమార్, పట్టణ కార్యదర్శి పి. కౌశిక్ కుమార్, వై. సంతోష్ కుమార్, రమేష్, హేమంత్ కుమార్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన టీడీపీ నేత సుబ్బారావును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వర్మ



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావును పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్వీఎస్ఎన్ వర్మ పరామర్శించారు. ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న సుబ్బారావును ఆయన నివాసంలో వర్మ శుక్రవారం నాడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయనకు ధైర్యం చెప్పారు.కొద్దిరోజుల క్రితం గుండ్ర సుబ్బారావు తన వ్యవసాయ పొలంలో పనులను పర్యవేక్షించడానికి వెళ్లారు. అక్కడ నీటి మోటార్ ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ ఆయన చేతి వేళ్లు రన్నింగ్‌లో ఉన్న మోటార్ బెల్ట్‌లో ఇరుక్కుపోయాయి. ఈ ఊహించని ప్రమాదంలో సుబ్బారావు కుడిచేతి మూడు వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఆయన్ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు.

**పరామర్శించిన వర్మ.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**


సుబ్బారావు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, శుక్రవారం గొల్లప్రోలులోని ఆయన నివాసానికి చేరుకున్నారు. సుబ్బారావును ఆప్యాయంగా పలకరించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి అప్రమత్తం చేశారు. సుబ్బారావు త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వర్మ పేర్కొన్నారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వర్మ పరామర్శించిన సమయంలో ఆయన వెంట స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సుబ్బారావు అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. పట్టణ అధ్యక్షుడిని పరామర్శించడానికి నియోజకవర్గ స్థాయి నేత రావడంతో స్థానిక కార్యకర్తల్లో ధైర్యం నిండింది. సుబ్బారావు ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగానే ఉందని, వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## సీఎం పర్యటనకు పటిష్ట భద్రత




**గుంటూరు ఆగస్టు 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తాడేపల్లి మండలం ఉండవల్లిలో సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జి, ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రారంభోత్సవానికి హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ క్షేత్రస్థాయిలో పర్యటించి వీఐపీ రూట్, బ్రిడ్జి పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ మార్గాలను పరిశీలించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ, ప్రవేశ నిష్క్రమణ మార్గాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా విధుల్లో ఉన్న సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకల సమయంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వీఐపీ రూట్‌లో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. బందోబస్తు నిర్వహణలో సాంకేతిక, కమ్యూనికేషన్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.పర్యటన సందర్భంగా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏపీ రవికుమార్, సీఐ వీరేంద్రబాబు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం






**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** వాసవి కళ్యాణ మండపం (అమ్మవారి శాల )పామిడి నందు ఈనెల (16-08-2026). 16. వ తేదీ ఆదివారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి. వారు ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మరియు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మరియు లైన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు .బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచితముగా ఆపరేషన్లు చేస్తారు .శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని లైన్స్ క్లబ్ సభ్యులు తెలియజేశారు .కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రావాలని తెలియజేశారు.ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలు మరియు పామిడి చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపత నాయుడు కోరారు.

## ఎస్ కే పి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు అకాడమిక్ కౌన్సిల్ సభ్యుల సమావేశం



**గుంతకల్లు ఆగస్టు 13 (ప్రజా జ్యోతి):** స్థానిక ఎస్కేపి ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో 2026-27 విద్యా సంవత్స రానికి స్వయం ప్రతిపత్తి కళాశాలలో నిర్వహించా ల్సిన అకాడమిక్ కౌన్సిల్ సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశానికి శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యా లయానికి సంబంధించిన ప్రొఫెసర్లు రవి ప్రసాద్ రావు, గీతాంజలి మరియు ప్రభాకర్ ఆన్లైన్ విధాన ములో హాజరయ్యారు. కళాశాలలోని ప్రతి విభాగం వారు వారి సబ్జెక్టు సిలబస్ లో మార్పులు చేర్పులు చేసి కౌన్సిల్ మెంబర్ల ముందు సమర్పించారు. అదేవిధంగా ప్రతి డిపార్ట్మెంట్లోనూ విద్యార్థుల కొరకు సర్టిఫికెట్ కోర్సులను నిర్వహించాలని తీర్మానించారు.ఈ సమావేశంలో ప్రొఫెసర్ల తోపాటు కళాశాల అకాడమిక్ మెంబర్లు ప్రముఖ న్యాయవాది డాక్టర్ బిఎస్ కృష్ణారెడ్డి ఆర్కిటెక్ బాల వెంకటేశ్వర్లు, విశ్రాంత అధ్యాపకులు అన్వర్ భాష ప్రత్యక్షంగా సమావేశంలో పాల్గొని వివిధ సబ్జెక్టులలోని సిలబస్ గురించి చర్చించి సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ శర్మ ,అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పవన్ కుమార్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ నాగరాజు మరియు వివిధ శాఖల అధిపతులు పాల్గొని ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికను రూపొందించడం జరిగింది.

## బద్వేల్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 13 (ప్రజాజ్యోతి)**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బద్వేల్ పట్టణంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని ఘనంగా నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కడప జిల్లా కో-కన్వీనర్ కొలిశెట్టి పవన్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ఈ కార్యక్రమం సాగింది. ఈ ర్యాలీలో హైస్కూల్ విద్యార్థి, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని మానవహారంగా ఏర్పడ్డారు. చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని వారు చేసిన 'భారత్ మాతా కీ జై' నినాదాలతో పట్టణ పురవీధులు హోరెత్తాయి.ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కో-కన్వీనర్ కొలిశెట్టి పవన్ కుమార్‌తో పాటు బీజేపీ కిసాన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు అన్నపురెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ధర్మశెట్టి వెంకట సుబ్బయ్య రాయల్, బీజేపీ జిల్లా సెక్రెటరీ కె.వి. రమణయ్య, హైస్కూల్ హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎన్.వి. సుబ్బారెడ్డి, శివా నాయక్, నాగేంద్ర, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రామకోటి రాజు, ఆంజనేయులు, లక్ష్మీ నరసింహ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని,తిరంగా యాత్ర కార్యక్రమం,




**డోన్ ( ప్రజా జ్యోతి )ఆగస్టు 13** నంద్యాల జిల్లాడోన్ పట్టణంలో గురువారం ఉదయం 9 గంటలకుజాతీయ జెండాలతో ఘనంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు.డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సైకిల్ ర్యాలీకి డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు,జాతీయ జెండాను ఊపి విద్యార్థుల సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని,యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ముఖ్యమని, అన్నారు.సైకిల్ ర్యాలీలో పాల్గొన్నవారు డోన్ మున్సిపాలిటీ కమిషనర్ సురేష్ రెడ్డి, ఆర్డిఓ నరసింహులు, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడువెంకట నాయినిపల్లె శ్రీను,డోన్ మున్సిపాలిటీ కమిషనర్ సురేష్ రెడ్డి,డోన్ మండల కన్వీనర్,రాఘవేంద్ర గౌడ్, మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ హరికృష్ణయ్య, దస్తగిరి, 32వ వార్డుధనంజయ, రంగారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, యువత, విద్యార్థులు, మహిళలు,జాతీయ జెండాలను చేతబట్టి ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో సైకిల్ ర్యాలీ విజయవంతమైనదని తెలిపారు,

# చిత్రాడలో పేద కుటుంబానికి జనసేన నాయకుల అండ





**కాకినాడ జిల్లా పిఠాపురం మండలం (ప్రజా జ్యోతి)** చిత్రాడ గ్రామంలో 4 ప్రభుత్వ – ప్రైవేట్ – ప్రజల భాగస్వామ్యం". కార్యక్రమాన్ని జనసేన పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను పరామర్శించి, వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఎన్ డి ఎ .వికసిత్ భారత్ కూటమి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో, కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిర్వహించారు. చిత్రాడ గ్రామానికి చెందిన కొప్పిశెట్టి రత్నం, బావిశెట్టి నాగ సత్యవతి కుటుంబాలను జనసేన నాయకులు పరామర్శించి వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించారు. కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు తదితర సామగ్రిని అందజేశారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ.. ఆర్థికంగా బలమైన వ్యక్తులు, సేవా సంస్థలు, పరిశ్రమలు, దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి, జీవనోపాధి వంటి రంగాల్లో వారికి అండగా నిలవడం ద్వారా సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. వికసిత్ భారత్ స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, పిఠాపురం మండలం జనసేన పార్టీ వైస్ ఇంచార్జ్ నిమ్మని దుర్గబాబు, చిత్రాడ జనసేన పార్టీ గ్రామ ఇంచార్జ్ నంద్యాల జాను, గ్రామ కమిటీ వైస్ ఇంచార్జ్ దేశిరెడ్డి సతీష్, వార్డ్ బూత్ ఇంచార్జిలు కందవల్లి రమణ, కుక్కల శ్రీనివాస్, కోలా శ్రీనివాస్, ప్రగాఢ సాయి, బావిశెట్టి నందీశ్వరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నిరంతరం ఉద్యోగుల సమస్యలపై పోరాటం

**కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ డిమాండ్**

**ప్రభుత్వం స్పందించకుంటే త్వరలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం రాష్ట్ర అధ్యక్షులు తుప్పి జోగారావు**

**సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకి అందజేత**





**కూనవరం ఆగస్టు 13. ప్రజా జ్యోతి**ఈ రోజు కూనవరం మండలం కోతులగుట్ట గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా వచ్చిన రంపచోడవరం యమ్ ఎల్ ఎ గారికి ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించడం జరిగింది

**సమస్యలు**

1) కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు వంద శాతం గ్రాస్ సాలరీ ఇవ్వాలని అన్నారు
2) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సెక్యూరిటీ సిబ్బంది నియమించాలి
3) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నాలుగవ స్టాఫ్ నర్సు నీ నియమించాలి
4) కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని నియమించాలి
5) చింతూరు ఐటిడిఎ పరిధిలో ఉన్న 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రలలో ఖాళీగా ఉన్న యు డి సి లను ఏర్పాటు చేయాలని

ఇంకా అనేక రకాల సమస్యలను వినతి పత్రం రూపంలో అందజేశామని తెలియజేశారు

అదే కాకుండా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి ఇప్పటికే పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చి ధర్నాలు, మీడియా సమావేశాలు పెట్టి ప్రభుత్వానికి తెలియజేసిన పట్టించుకోవడం లేదు త్వరలో కాంట్రాక్ట్ ఉద్యోగులతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేస్తున్నామని ప్రకటించారు

ఈ కార్యక్రమంలో ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు తాటి రామకృష్ణ, పి దేవి ప్రసన్న, సి హెచ్.భారతి, కె.భువన,కె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరికీ వైద్య భద్రత కల్పించాలి

**వైద్య బీమా పథకాలపై కలెక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ సమీక్ష**



**బాపట్ల ఆగస్టు 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతిని)** ప్రభుత్వ వైద్య బీమా పథకాల ప్రయోజనం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ అధికారులను ఆదేశించారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారికి కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై), ప్రధానమంత్రి వయో వందన యోజన (పీఎంవీవై) అమలు తీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. పీఎంజేఏవై ద్వారా అర్హులైన ప్రజలకు సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య బీమా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 6.52 లక్షల మందికి కార్డులు అందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ వైద్య భద్రతపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, అవసరమైన సమయంలో పథకాన్ని వినియోగించుకునేలా వారికి సమాచారం అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. దేశంలోని ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ పథకం ద్వారా ఉచితంగా వైద్యం పొందే అవకాశం ఉందని తెలిపారు. 70 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు వర్తించే ప్రధానమంత్రి వయో వందన యోజనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. అర్హులందరికీ ఈ-కేవైసీ పూర్తి చేసి కార్డులు అందించే ప్రక్రియను త్వరితగతిన ముగించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 37 వేల మంది వృద్ధులకు ఈ కేవైసీ పూర్తయిందని తెలిపారు. పేద, నిరుపేద వర్గాలకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలు అందుతున్న ఆసుపత్రుల్లో ఈ పథకాల ప్రయోజనాలు అర్హులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, డీసీహెచ్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ స్వర్ణోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు







**గుంటూరు ఆగస్టు 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, సీనియర్ రాజకీయ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ 50 సంవత్సరాల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించిన రాజకీయ స్వర్ణోత్సవ సంబరాలు, జన్మదిన వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ వేడుకలకు బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథిగా హాజరై కన్నా లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా ప్రజా జీవనంలో కొనసాగుతూ రాజకీయ, సామాజిక రంగాల్లో కన్నా లక్ష్మీనారాయణ అందించిన సేవలను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థి దశ నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి వివిధ పదవులు, బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ అనుభవం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజలతో మమేకమై పనిచేయడం, పార్టీ బలోపేతానికి కృషి చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించడం ఆయన ప్రత్యేకతగా నిలిచిందన్నారు. రాజకీయాల్లో ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం అరుదైన ఘనత అని, ప్రజా జీవితంలో ఇంత సుదీర్ఘ కాలం కొనసాగడం వెనుక ప్రజల ఆదరణ, కార్యకర్తల అభిమానం, నిరంతర ప్రజాసేవ ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కన్నా లక్ష్మీనారాయణకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని, భవిష్యత్తులో నూ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వేడుకలకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కన్నా లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన రాజకీయ స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని కన్నా లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు.

## సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయి పర్యవేక్షణకు కమిషనర్ ఆదేశం



**బాపట్ల ఆగస్టు 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సచివాలయ సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలని బాపట్ల పురపాలక సంఘం కమిషనర్ ఎం. హాసిని సూచించారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో సంక్షేమ పథకాల అమలు తీరును ఆమె పరిశీలించారు. పథకాల అమలులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై కార్యదర్శుల నుంచి వివరాలు సేకరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనం పొందని వారిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. లబ్ధిదారులకు వస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్‌పై కూడా కమిషనర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను నిర్లక్ష్యం చేయకుండా, సమస్యలుంటే వెంటనే గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. పెన్షన్ల పంపిణీలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్‌జీఎస్‌డబ్ల్యూ మేనేజర్ కె. రాధ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీపీఆర్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు




**గుంతకల్లు ఆగస్టు 13 (ప్రజా జ్యోతి):** గుండెపోటు వచ్చిన రోగికి మొదటి కొన్ని నిమిషాల్లోనే సీపీఆర్ అందించడం ద్వారా జీవించే అవకాశాలు రెండింతల నుంచి మూడింతల వరకు ఉంటుందని ఎస్కేపి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య అన్నారు. గురువారం ఎస్‌కెపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), గుంతకల్లు లో పద్మావతి నర్సింగ్ కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో కార్డియో పల్మనరీ రెససికేషన (సీపీఆర్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా. లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే జువాలజీ అధ్యాపకులు నారాయణ అధ్యాపకులు హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల సిబ్బంది గుండెపోటు, శ్వాస ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సీపీఆర్‌ను ఎలా చేయాలో విద్యార్థులకు ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. అత్యవసర సమయాల్లో సరైన పద్ధతిలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయ ని తెలిపారు. విద్యార్థులు కార్యక్రమంపై ఆసక్తి కనబరిచి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో ప్రథమ చికిత్సపై అవగాహన పెంపొందించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా స్పందించే నైపుణ్యాన్ని పెంపొందించిం దని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ప్రజలు సీపీ ఆర్‌పై అవగాహన పెం చుకొని నైపుణ్యాన్ని నేర్చుకుంటే మనిషి జీవితాన్ని కాపా డవచ్చన్నారు నర్సింగ్ విద్యార్థులు తెలిపారు.

## తమ్మవరం గ్రామంలో 'వన్ మంత్ -- వన్ విలేజ్ -- ఫోర్ విజిట్స్'

**ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించిన తహసీల్దార్ ఎస్. పైడిరాజు**





**కాకినాడ జిల్లా తిమ్మాపురం (ప్రజా జ్యోతి)** ప్రభుత్వం అమలు చేస్తున్న 'వన్ మంత్ -- వన్ విలేజ్ -- ఫోర్ విజిట్స్' కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ మండలం తమ్మవరం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఎస్. పైడిరాజు గ్రామ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఏపీఐఐసీకి సంబంధించిన భూముల సమస్యలు, భూ సంబంధిత అంశాలపై గ్రామస్తులు అర్జీలు సమర్పించారు. ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నమోదు చేసుకున్నారు. హౌసింగ్ అధికారులు నాగభూషణం, మండల రెవెన్యూ అధికారి ఎం.వి. దుర్గాభవాణి, వీఆర్వో సత్తిబాబు, సచివాలయ కార్యదర్శి రత్నం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గ్రామ జనసేన నాయకులు గొల్లపల్లి రమణ, గొల్లపల్లి బాబితో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

## పాఠశాలల వివరాలను యుడైస్ ప్లస్ లో ఖచ్చితత్వంతో నమోదు చేయాలి

– మండల విద్యాశాఖాధికారి వెన్నా శ్రీనివాసరావు



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు, పాఠశాలలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో యుడైస్ ప్లస్ వివరాలను పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి–1 వెన్నా శ్రీనివాసరావు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక మండల వనరుల కేంద్రం లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యుడైస్ ప్లస్ నమోదుపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యా పరమైన మౌలిక వసతుల అవసరాలను గుర్తించడానికి యుడైస్ డేటా అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గడువులోగా వివరాలన్నింటినీ ఆన్‌లైన్ చేయాలన్నారు. అనంతరం కంప్యూటర్ ఆపరేటర్ ఆర్. రాజు ప్రధానోపాధ్యాయులకు కంప్యూటర్/ఆన్‌లైన్ ద్వారా డేటాను ఎలా నమోదు చేయాలనే అంశంపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. హెచ్ఎంలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## తిమ్మాపురంలో పశు వైద్యశాల ప్రారంభం



**కాకినాడ జిల్లా తిమ్మాపురం (ప్రజా జ్యోతి)** కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అసంపూర్తిగా వదిలేసిన పశు వైద్యశాల భవనాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం రూ. 14.50 లక్షల నిధులతో పూర్తి చేసి గురువారం పశు వైద్యశాలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించి, రైతులకు మరియు పశుపోషకులకు ఈ పశువైద్యశాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, చిక్కాల రామచంద్ర రావు, మాదారపు తాతాజీ, బత్తుల గణేష్ (దొరబాబు), శిరంగు శ్రీనివాస్, డా. చప్పిడి వెంకటేశ్వర రావు, నురుకుర్తి వెంకటేశ్వర రావు, పితాని లీల, మాసుమేను మంగా గంగయ్య, నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, బందిలి వీరేష, కర్రి వెంకట రాజు, సుందర సతీష్, కాళ్ల ధనరాజు, పుల్ల శ్రీరాములు, తలాటం బుజ్జి, సీతయ్య దొర, మరియు పశుసంవర్ధక శాఖ అధికారులు, కూటమి శ్రేణులు, వీర మహిళలు మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ.ఎస్.డి.ఎస్,సంస్థ ఆధ్వర్యంలో!.. దుస్తులు కిట్స్ పంపిణీ!..



**వి.ఆర్.పురం,ఆగస్టు13(ప్రజాజ్యోతి ప్రతినిధి)**వరద ప్రభావిత ప్రాంతమైన, చిన్నమట్టపల్లి, పంచాయతీలోని గుండుగూడెం గ్రామంలోనీ200 మంది ప్రజలకు,ఏ.ఎస్.డి.ఎస్,సంస్థ ఆధ్వర్యంలో,క్లోథింగ్ కిట్సు పంపిణీ కార్యక్రమం చేశామని,ఏ.ఎస్.డి.ఎస్,సంస్థ సభ్యులు వెల్లడించారు.గురువారం,ఈ సందర్భంగా,మాజీసర్పంచ్ పిట్ట రామారావు,మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన వారికి ఏ.ఎస్.డి.ఎస్,సంస్థ,బట్టల కిట్స్,అందించారని ఆయన తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో ఏకష్టం వచ్చినా ఏ.ఎస్.డి.ఎస్,సంస్థ అద్భుతమైన సేవలు అందిస్తుందని చెప్పారు.సంస్థ పౌండర్ డైరెక్టర్,బాలల హక్కులు పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు,కికృతజ్ఞతలు తెలిపారు ఈపంపిణీ కార్యక్రమంలో,200 మంది లబ్ధిదారులు,సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నయ్య వదినమ్మ కు 1 వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి తనయుడు ఉరవకొండ యువనేత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాయలసీమ యువజన విభాగం అధ్యక్షులు యంగ్ డైనమిక్ ప్రణయ్ రెడ్డి అన్న మరియు రోహిత వదిన గార్లకు ఒకటవ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షులు చిన్న కొండప్ప శ్రీనివాస్ నాయుడు మరియు మరుట్ల గ్రామపంచాయతీ వైసీపీ నాయకులు తెలియజేశారు.




# ఏజెన్సీలో జననీరాజనాలు!.. అడుగడుగునా హారతులు!..

ఏజెన్సీగ్రామాల్లో పట్టుబిగిస్తున్న కూటమి ప్రభుత్వం!..

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అద్భుత స్పందన!..







**వి.ఆర్.పురం, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** ప్రజా సంక్షేమమే ప్రధానధ్యేయంగా, కూటమి ప్రభుత్వ, పాలన సాగుతుందని, రాష్ట్రంలో స్థానిక సమరం దగ్గర పడుతున్నకొద్ది అధికార తెలుగుదేశంపార్టీ పావులు కదుపుతోంది. రెండేళ్ళ నమ్మకం, సంక్షేమం అభివృద్ధిపై "ఇంటింటికీ, తెలుగు దేశం, కార్యక్రమం, పర్యటనలో రంపచోడవరం, నియోజకవర్గ శాసనసభ్యురాలు మిర్యాల శిరీషాదేవికి, మండలంలో ప్రజల నుండి అనూహ్యంగా స్పందన లభించింది. మండలంలోని ములకన పల్లి, పంచాయతీలోని, జల్లివారి గూడెం, కుంజవారిగూడెం, కొత్తపేట, ములకనపల్లి, కుందులూరు, పంచాయతీలోని కుందులూరు, తెల్లవారిగూడెం గ్రామాల్లో, చిన్నమట్టపల్లి పంచాయతీలోని ప్రత్తిపాక, చిన్నమట్టపల్లి, గ్రామాల్లో, రేఖపల్లి, పంచాయతీలోని ఉమ్మడివరం, అన్నవరం గ్రామాల్లో, రాజుపేట పంచాయతీలోని రాజుపేట కాలనీలో, వడ్డిగూడెం పంచాయతీ ఒడ్డిగూడెం గ్రామంలో,రెండేళ్ళ నమ్మకం, సంక్షేమం అభివృద్ధిపై "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.జనంబ్రహ్మరథం పట్టారు.

### అద్భుతమైన ఆదరణ!..

ఈ సందర్భంగా ఆమెకు పార్టీ శ్రేణులు గ్రామస్తులు పూల మాలలు వేసి, నుదుట తిలకందిద్ది హారతులుఇచ్చి ఆమెకు ఘనంగా ఘనస్వాగతం పలికారు. ఊహించని ఆదరణ రావడంతో కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంతో ఉన్నారు. శాసన సభ్యురాలు ప్రతీ ఇంటికీ,ప్రతీ గడపకు,వెళ్ళికూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేశారు. అనూహ్యంగా ప్రజలే ఎమ్మెల్యేను చూసేందుకు. మాట్లాడేందుకు ఉత్సాహం చూపించారు. ఈపర్యటనలో ఆమె రామవరం పంచాయతీలోనీ గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవం చేసి,కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం– అభివృద్ధి సంక్షేమం' డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రతీ గడపలో మహిళలు పాల్గొని పూలవర్షం కురిపించారు.దిష్టి తీసి అడ్వాన్స్ శ్రావణ మాస శుభాకాంక్షలు తెలియజేశారు.

### పరామర్శలు!..

ఈ పర్యటనలో ఎక్కడా అలసట చూపించలేదు. ప్రజలకు దగ్గరగా వెళ్లి పలకరించారు. ఫొటోలు దిగేందుకు చిన్నా, పెద్దా, తేడాలేకుండా పోటీ పడ్డారు.ప్రజలస్పందన చూసి ఆనందంతో, శాసనసభ్యురాలు మిరియాల శిరీషాదేవి, ఉక్కిరిబిక్కిరి అయ్యారు.శ్రీ రామగిరి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన నాళ్లరపు నవీన్, కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడకండి అండగా ఉంటామనితెలిపారు.

### ఎవ్వరికీ అన్యాయం జరగదు!..

### కూటమిప్రభుత్వంన్యాయం చేస్తుంది!..

ఎవ్వరికీ అన్యాయం జరగదని, పోలవరం ప్రాజెక్టువల్ల నష్టపోయిన, ప్రతీ ఒక్కఅర్హుడైన నిర్వాసితునికి కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని,ఎవ్వరు అధ్యైర్యపడొద్దని ఆమె సూచించడంతో ప్రజల నుండి హార్షద్వానాలు వినిపించాయి. మండల వ్యాప్తంగా అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. ఊహకందని విదంగా ప్రజలే ఎక్కడికక్కడ స్వాగత ఏర్పాట్లు చేసుకున్నారు.

### అద్భుతమైన రాజధాని దేశం గర్వపడేలా!..

అద్భుతమైన రాజధాని, దేశంగర్వించేలా అమరావతిని ఎకనామిక్ రీజియన్ గామార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే నని,చెప్పడంతో ప్రజలు ఆశక్తిగా ఆలకించారు.అలాగే మేనిఫెస్టోలో ఇవ్వనిహామీలు, కూడా అమలు చేస్తున్నట్లు వివరించారు.మాట ఇచ్చిన ప్రకారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు పెంచి ప్రభుత్వం అందిస్తున్నదని, ఇదినిజం కాదాని శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి, అడగడంతో ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభించింది.అంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పాలనకు,మంచి మార్కులు ఏజెన్సీ ప్రజలు. వేశారనే అభిప్రాయం తేట తెల్లం అయ్యింది. గత ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన అందిస్తూ, విధివిధానాలపై చైతన్యం అబ్బురపడే నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎమ్మెల్యే చెప్పడంతో హార్షద్వానాలు మారుమ్రోగాయి.ఆసాంతం సాగిన కార్యక్రమంలో తెలుగుదేశం,జనసేన,భారతీయ జనతా పార్టీ, నాయకులు కార్యకర్తలు భారీగా ప్రజలు, తరలివచ్చారు. ఆశీర్వదించారు.కార్యక్రమం విజయపథంలో ముగిసింది.

# రాజవొమ్మంగిలో ఘనంగా కంబాల కానుక, వనితల వేడుక పట్టు చీరలు పంపిణీ

భారీగా తరలివచ్చిన గిరిజన మహిళలు

మూడు వేలు మందికి పట్టుచీరలు పంపిణీ చేసిన కంబాల దంపతులు

లక్కీడ్రాలో గెలిపొందిన 100 మహిళలకు బంగారు రూపులు, పంపిణీ



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) ఆగస్టు 13::** పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, రాజవొమ్మంగి గ్రామంలోని శ్రీశ్రీ హరి శివకామాక్షి ఫంక్షన్ హాల్ లో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ–1 కంబాల శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో బుధవారం రాజవొమ్మంగి మండలానికి సంబంధించి నిర్వహించిన, బంగారు వరలక్ష్మి కానుక సీజన్–4 లక్కీడ్రా, కంబాల కానుక వనితల వేడుక పట్టుచీరలు పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారీగా గిరిజన మహిళలు, తరలివచ్చి పాల్గొన్నారు. తొలిత కంబాల శ్రీనివాసరావు గారి, దంపతులకు రాజవొమ్మంగి గ్రామస్తులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు.అనంతరం కంబాల శ్రీనివాసరావు గారు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన, కంబాల దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన లక్కీడ్రాలో గెలిపోందిన 100 మంది మహిళలకు బంగారు రూపులు, పట్టుచీరలు, పసుపు, కుంకుమను కంబాల శ్రీనివాసరావు గారి దంపతులు ఉచితంగా పంపిణీ చేసారు.అలాగే 3,000 మంది మహిళలకు పట్టు చీరలు, పసుపు, కుంకుమ పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం నందు గోపూజ, ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించిన డిప్యూటీ కమిషనర్ వాణి,ఆలయ చైర్మన్ టీ.జి పాండురంగ శెట్టి





**కౌతాళం,ఆగస్టు 13 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి ఆలయం నందు శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభముకు ముందుగా, గోపూజ మరియు ధ్వజారోహణ కార్యక్రమము ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి,మరియు ఆలయ చైర్మన్ టీజీ. పాండురంగయ్య శెట్టి గురువారం రోజున ఈ కార్యక్రమం ప్రారంభం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.



# ప్రజాసమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే!..

**నిరాశను మిగిల్చిన పర్యటన!..**

**వై.కా.పా,మండల కమిటీ ఆరోపణ!..**



**వి.ఆర్.పురం,ఆగష్టు13(ప్రజాజ్యోతి ప్రతినిధి)**ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నిరాశను మిగిల్చిందని, వై.కా.పా,మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, ఆరోపించారు. గురువారం, మాదిరెడ్డి సత్తిబాబు, స్వగృహం లో, వైస్ ప్రెసిడెంట్,బంధం రాజు, అధ్యక్ష తన వై.కా.పా, మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కన్వీనర్ మాది రెడ్డి సత్తిబాబు, మాట్లాడుతూ, బుధవారం, వరరామచంద్రాపురం, మండలంలో కూటమి ఎమ్మెల్యే, పర్యటన నిర్వహించారని, ఏంసాధించారని, ఇంటింటికీ, కార్యక్రమం చేపట్టారని ఆయన ప్రశ్నించారు. గడిచినరెండేళ్లలో తెలుగుదేశంపార్టీఅభివృద్ధి ఇంటింటికి ప్రచారంఅనే కార్యక్రమంకి రావటం,ఒకళ్ళిద్దరి కార్యకర్తల ఇంటికి మాత్రమే వెళ్లి రెండు మూడు చోట్ల ఒకరిద్దరిని పార్టీలోకి జాయిన్ చేసుకోవడం, ఇదేనా అభివృద్ధని ఆయన విమర్శించారు. టేకులూరు, కొక్కిరిగూడెం, ములకనపల్లి, కుందులూరు, రామవరం, పంచాతీలకు సంబంధిన కార్యకర్తలు వైస్సార్సీపీ మండల కమిటీ దృష్టికి, తేవటం జరిగిందని, అభివృద్ధి లేకుండా పర్యటనలు ఎందుకని ఆయన అన్నారు. రాజుపేట, వడ్డిగూడెం తదితర పంచాయతీలలో పర్యటించారని ప్రజాసమస్యలు ప్రజలనుంచి వినతులుఎక్కడ తీసుకోలేదని, సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన బాధితులతో కనీసం మాట్లాడ లేదని, ఆయన ఆరోపించారు. పెదమట్టపల్లి, నుంచి నరసింగపేట, చింతూరు, మీదుగా వెళ్లే ప్రధానరహదారి సమస్య చెప్పుకోవడానికి వచ్చిన కుందులూరు, గ్రామపంచాయతీకి సంబంధించిన గ్రామస్తులతో కనీసం మాట్లాడలేదని స్థానిక గ్రామస్థులు మండలకమిటీ దృష్టికితీసుకు వచ్చారని, ఇదేనా అభివృద్ధని ఆయన విమర్శించారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కార్యకర్తలు నాయకులు ఎవరు పార్టీ మారలేదని అందరూ, వై.కా.పా,లోనే ఉన్నారని వివరించారు. ఎమ్మెల్యే పర్యటన వల్ల ఏజెన్సీగ్రామాల ప్రజలు ఎంతో,కొంత, కొన్నైనా, సమస్యలు తీరుతాయని, ఆశించారని, నిరాసే కలిగిందని వారన్నారు. ఈ సమావేశ కార్యక్రమంలో ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ,జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, (బాలు) ఎస్సీ సెల్ నాయకులు చీమల కాంతారావు, మహిళా విభాగం మండల నాయకులు గుంటనపల్లి చైతన్య,గుజ్జ రాజేశ్వరి, తెల్లం కన్నారావు, మడకం రాము,ముడివి లచ్చయ్య, ముత్తయ్య,కుంజా దులయ్య, కొక్కిరే భద్రయ్య, కొక్కిరి వెంకటేష్, తదితరులు హాజరయ్యారు.

# బద్వేల్‌లో అంగరంగ వైభవంగా టిడిపి నేత కొంకుల రాంబాబు జన్మదిన వేడుకలు





**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 13 (ప్రజా జ్యోతి)** తెలుగుదేశం పార్టీ బద్వేల్ మాజీ పట్టణ అధ్యక్షుడు కొంకుల రాంబాబు జన్మదిన వేడుకలు బద్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో కార్యకర్తలు, బంధుమిత్రులు, స్నేహితులు మరియు అభిమానుల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రాంబాబు నివాసం అభిమానుల కోలాహలంతో, కేరింతలతో పండుగ వాతావరణాన్ని తలపించింది. రాంబాబు కేక్ కట్ చేసి అందరికీ తినిపించగా, తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా గజమాలలు వేసి, దుశ్శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొంకుల రాంబాబు మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. "నాకు ఓటు హక్కు వచ్చిన నాటి నుండి తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడనై రాజకీయాల్లోకి ప్రవేశించాను. నాటి నుండి నేటి వరకు మీ అందరి అపారమైన అభిమానం, ఆప్యాయతలే నన్ను నడిపించాయి. కార్యకర్తల కష్టార్జితం, మీ అందరి తోడ్పాటు వల్లే నాకు పార్టీలో తగిన గుర్తింపు లభించింది" అని అన్నారు. రాబోయే కాలంలో కూడా పార్టీ బలోపేతానికి, క్రమశిక్షణతో కష్టపడే ప్రతి ఒక్క కార్యకర్తకు నా సాయశక్తులా అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. నాపై ఉన్న నమ్మకంతో, అభిమానంతో స్వయంగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. కొంకుల రాంబాబు తన జన్మదినాన్ని పురస్కరించుకుని మానవత్వాన్ని చాటుకున్నారు. హంగు ఆర్భాటాలకే పరిమితం కాకుండా, ఆయన తన స్వంత ఖర్చులతో పట్టణంలోని స్థానిక బస్టాండ్ మరియు మార్కెట్ యార్డ్ పరిసర ప్రాంతాల్లోని నిరాశ్రయులకు, యాచకులకు ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా రాంబాబు గారే స్వయంగా ఖర్చు భరించి నిరుపేదల ఆకలి తీర్చడం పట్ల పట్టణ ప్రజలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రజా సంక్షేమం అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

**- మెట్టక్కివలసలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధి , సంక్షేమం ఇంటింటా ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్,ఎమ్మెల్యే కూన రవికుమార్**



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:**కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఆమదాలవలస పట్టణంలోని మెట్టక్కివలసలో ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు.మెట్టక్కివలస ప్రాంతంలో ప్రజల సమస్యలను ఇంటి వద్దే అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం , అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆమదాలవలస నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని రవికుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు , స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ పేమెంట్లతో ఉపాధి కోల్పోతున్న విద్యుత్ బిల్ కలెక్టర్లు ఆవేదన





**ఎమ్మిగనూరు, అగస్ట్ 13(ప్రజా జ్యోతి ):** స్థానిక పట్టణంలో విద్యుత్ బిల్లుల చెల్లింపులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురావడంతో ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న వందలాది మంది బిల్ కలెక్టర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని బిల్ కలెక్టర్లు మాల శివ, గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పరిష్కరించాలన్నారు తాము గత 30 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో బిల్ కలెక్టర్లుగా పనిచేస్తు ఒక్కో బిల్ కలెక్టర్ కింద మరో నలుగురు వరకు కార్మికులు పనిచేస్తున్నారని, బిల్ కలెక్టర్లతో పాటు వారూ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటలైజేషన్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే తమను తొలగించకుండా విద్యుత్ శాఖలోనే ప్రత్యామ్నాయ పనులు కల్పించి జీవనోపాధి కొనసాగించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యుత్ బిల్లుల వసూళ్లను నమ్ముకుని అరకొర జీతాలతో జీవిస్తున్న తమకు తాజా నిర్ణయం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణపై ప్రభావం పడుతోందని తెలిపారు. 30 ఏళ్లుగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నందున తమ విద్యార్హతలను పరిగణనలోకి తీసుకుని విద్యుత్ శాఖలోనే ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.తమ సమస్యను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఆయన సానుకూలంగా స్పందించారని బిల్ కలెక్టర్లు తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యను తప్పకుండా ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.అలాగే వారి కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో వినోద్ కుమార్, ఎం వెంకటేశ్వర్లు, వీరేష్ పాల్గొన్నారు.

# కౌతాళం ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తిరంగా యాత్ర కార్యక్రమం,



**కౌతాళం,ఆగష్టు 13 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో గురువారం రోజున జాతీయ జెండాలతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. తాసిల్దార్ కార్యాలయం నుండి ఏర్పాటు చేసిన విద్యార్థుల ర్యాలీకి ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు,జాతీయ జెండాను ఊపి విద్యార్థుల యాత్ర ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డి మాట్లాడుతూ,స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని, యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ముఖ్యమని వారు అన్నారు. ర్యాలీలో పాల్గొన్నవారు ఎంఆర్ఓ రజనీకాంత్ రెడ్డి వారి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, యువత, విద్యార్థులు, మహిళలు,జాతీయ జెండాలను చేతబట్టి ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో ర్యాలీ విజయవంతంగా చేశారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధికి పరిశ్రమలు సహకారం ఇవ్వాలి

**మాజీ ఎంపీటీసీ కారంచేటి శివరామ ప్రసాద్ శర్మ.**



**ముత్తుకూరు, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి)** కృష్ణపట్నం గ్రామంలోపాడి పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందే విధంగా పరిశ్రమల యాజమాన్యాలు చేయూత ఇవ్వాలని కృష్ణపట్నం మాజీ ఎంపీటీసీ సభ్యులు, పాడి పరిశ్రమ రైతు కారంచేటి శివరామ ప్రసాద్ శర్మ కోరారు. గురువారం గ్రామంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భ నిర్ధారణ వైద్య పరీక్షల శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి కారంచేటి సహకారం ఇచ్చారు. వల్లూరు పశు వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ గౌరీ శంకర్ 50 పశువులకు గర్భ నిర్ధారణ వైద్య పరీక్షలు జరపగా 30 పశువులకు గర్భం నిర్ధారణ జరిగింది. మరో 20 పశువులకు నిర్ధారణ కాలేదని వైద్యులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో మందులు అందజేశామని తెలిపారు. అనంతరం మాజీ ఎంపీటీసీ కారంచేటి మాట్లాడారు. పరిశ్రమల స్థాపనలో పాడి పరిశ్రమ కొంతమేరకు దెబ్బతిని పోయిందన్నారు. ప్రస్తుతం కొంతమంది మాత్రమే ఈ పరిశ్రమను కొనసాగిస్తున్నారని మాజీ ఎంపీటీసీ అన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలు పాడి పరిశ్రమ రైతులకు సహకారం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆసక్తి కలిగిన, ప్రస్తుతం కొనసాగుతున్న రైతులకు పరిశ్రమల యాజమాన్యాలు ఉచితంగా పశువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది అహ్మద్, గోపాలమిత్ర మురళి, పాడి పరిశ్రమ రైతులు గూడలి మధుసూదన్ రావు శర్మ, నెల్లిపూడి రాము, గోపాలయ్య, మక్కి మహేష్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# నేడు ఎటపాకలో ఎమ్మెల్యే శిరీషాదేవి విస్తృత పర్యటన

**రూ.లక్షలతో చేపట్టే పలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు**

**పార్టీ శ్రేణులతో సమావేశం**

**ఇంటింటికీ తెలుగుదేశంలో పాల్గొననున్న ఎమ్మెల్యే**




**ఎటపాక, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):**రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి శుక్రవారం ఎటపాక మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం, కుటుంబ పరామర్శలో పాల్గొననున్నారు.

**త్రిపురపెంటవీడులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన**

ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు త్రిపురపెంటవీడు గ్రామంలో పంచాయతీరాజ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శిరీషాదేవి శంకుస్థాపన చేయనున్నారు.

**గన్నవరంలో మరో రోడ్డు పనులకు శ్రీకారం**

ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు గన్నవరం గ్రామంలో పంచాయతీరాజ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు.

**లక్ష్మీపురంలో పార్టీ శ్రేణులతో సమావేశం**

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లక్ష్మీపురం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1.45 నుంచి 2.30 గంటల వరకు లక్ష్మీపురం పంచాయతీలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని, పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరైన పలు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

**రామగోపాలపురంలో ఇంటింటికీ తెలుగుదేశం**

మధ్యాహ్నం 2.40 నుంచి 3 గంటల వరకు రామగోపాలపురం గ్రామంలో నిర్వహించే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీషాదేవి పాల్గొంటారు.

**వెంకన్న కుటుంబానికి పరామర్శ**

మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు నెల్లిపాక గ్రామంలో దివంగత వెంకన్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించనున్నారు.

**చోడవరంలో ఇంటింటికీ తెలుగుదేశం**

సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు చోడవరం గ్రామంలో నిర్వహించే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు.

**భారీగా తరలిరావాలని పిలుపు**

ఎమ్మెల్యే శిరీషాదేవి పర్యటన సందర్భంగా ఎటపాక మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం కోరింది.

# స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే కూటమి లక్ష్యం

– మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

– వాంబే కాలనీలో త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు మంజూరు

– నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళ్తా రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ ,ఎమ్మెల్యే కూన రవికుమార్

**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:** మెట్టక్కివలస వాంబే కాలనీ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక అడుగు పడింది. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలస వాంబే కాలనీలో రూ.81.52 లక్షల ఏ.ఐ.ఐ.బి నిధులతో చేపట్టనున్న తాగునీటి అభివృద్ధి పనులకు ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు.ప్రాజెక్టులో భాగంగా 600 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్ ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.వాంబే కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయించి ప్రాజెక్టును చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.ట్యాంకు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులోగా





పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే కాలనీ ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన తాగునీటి సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తూ ఆమదాలవలస నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని కూన రవికుమార్ పేర్కొన్నారు. తాగునీటి విషయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మెట్టక్కివలస వాంబే కాలనీ ప్రజలకు తాగునీటి సరఫరాలో మేలు జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి





**ఎమ్మిగనూరు, అగస్ట్ 12(ప్రజా జ్యోతి ):** పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలు మరియు స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం మొదటి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ సోమప్ప సర్కిల్, ఎస్‌బీఐ బ్యాంక్ మీదుగా ఓం శాంతి సర్కిల్ వరకు ఉత్సాహంగా సాగింది. పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, అధికారులు మరియు ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బీవీ సైకిల్ ర్యాలీలో పాల్గొని దేశభక్తి, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.అనంతరం 'వనం--మనం' కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. మహిళలకు, 10వ వార్డు ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, వాటిని సంరక్షించి పెంచాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వాతంత్ర్య వేడుకలు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా దేశభక్తి, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ వంటి విలువలను ప్రతి ఒక్కరిలో పెంపొందించేలా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.అలాగే స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ, వారి ఆర్థిక స్వావలంబన, స్వేచ్ఛాయుత ప్రయాణానికి కూటమి ప్రభుత్వం మరింత భరోసా కల్పించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, ఏఎంసీ చైర్మన్ కురువ మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, మహిళలు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# పంపా రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** తొండంగి మండలం మరియు తుని మండల రైతులు సాగునీటి ఇబ్బందులు దృష్ట్యా ఈరోజు అన్నవరం పంపా రిజర్వాయర్ కార్యాలయంలో అధికారులను కలిసి తక్షణమే అన్నవరం పంపా రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని వినతి పత్రం అందజేసి, మీడియా వారితో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కు వెళ్లే ఏలేరు కాలువ రౌతులపూడి మండలం బంగారయ్యపేట గ్రామంలో 33.5 రీచ్ దగ్గర ఎమర్జెన్సీ స్లూయిస్ (తూము) పెట్టడం జరిగింది కాబట్టి ఇటువంటి నీరు లేని సందర్భాల్లో పంపా ప్రాజెక్టు కి నీరు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన స్లూయిస్, దాని ద్వారా నీటిని విడుదల చేస్తే పంపా ప్రాజెక్టు కి నీరు వస్తుంది మరియు గోదావరి లో నీరు ఎక్కువగా ఉంది కాబట్టి పురుషోత్తమ పట్నం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఏలేరు కు వదిలితే ఆర్.ఆర్.బి ట్యాంక్ ద్వారా ఉప్పు ట్యాంక్ కి వస్తుంది. కలెక్టర్ మరియు ఇరిగేషన్ అధికారులు ఈ రెండు మార్గాలు పై దృష్టి పెట్టే నీటిని విడుదల చేయాలని కోరారు మరియు ప్రభుత్వం రైతులకు ఈ కష్ట కాలంలో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని తద్వారా సబ్సిడీ లోన్లు రైతులకు ఇచ్చి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరిన వైసీపీ నాయకులు యనమల కృష్ణుడు రాష్ట్ర వైసీపీ పంచాయతీ వింగ్ సెక్రెటరీ కొయ్య మురళీ కృష్ణ తుని జెడ్పీటీసీ లిపోతల రమణ వైసీపీ సీనియర్ నాయకులు బత్తుల వీరబాబు తొండంగి వైస్ ఎంపిపి-1 నాగం గంగబాబు తొండంగి వైస్ ఎంపిపి -2 లియాదాల కృష్ణ ఎంపీటీసీ అంబుజాలపు అప్పలరాజు అన్నవరం ఎంపిటిసి దడాల సతీష్ ఎంపీటీసీ కొంతి సతీష్ గాబు రాజు ,అన్నవరం పార్టీ అధ్యక్షుడు రాయవరపు శ్రీను సీనియర్ నాయకులు పేకెటి హరికృష్ణ తోట కొండబాబు మాజీ ప్రెసిడెంట్ కటకం ఈశ్వరరావు పెరుమాళ్ళ లోవరాజు అడపా సురేష్ ,కొయ్య బుజ్జి రౌతు శివ నేమాల దండు, మచ్చర్ల నాగేశ్వరరావు, బూర్తి విక్టర్ పిల్లి సత్తిబాబు గుడ్ల ప్రసాద్ పారేపల్లి సురేష్ మురాలశెట్టి నాగ వెంకటరమణ సుంకర శివరామకృష్ణ పోల్నాటి రామకృష్ణ, బండి రాజేష్ తలపంటి శ్రీను అంబుజాలపు రామకృష్ణ గుల్ల చిన్న గారు, యాదల రాజు గారు మరియు తొండంగి మండల రైతులు పాల్గొన్నారు.



# చదువుల గుడిలో స్వేచ్ఛా సంబరాలు..చిన్నారుల ప్రతిభకు జైహో!

నల్లకుంట ఆశ్రమ పాఠశాలలో మిన్నంటిన ఉత్సాహం

వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనంలో ఆకట్టుకున్న ఆశ్రమ వాసులు

**ఎటపాక, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎటపాక మండలం నల్లకుంటలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీలను వైభవంగా ప్రారంభించారు. ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించే ఈ పోటీల ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమేనని హెచ్ఎం తెలిపారు. పాఠశాల ఆవరణలో గేమ్స్, అథ్లెటిక్స్‌తో పాటు మ్యూజికల్ చైర్స్ వంటి వినోదాత్మక పోటీలను ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పోటీల సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల కేరింతలు, సందడితో కళకళలాడింది. ఆటలతో పాటు విద్యార్థుల ఆలోచనా శక్తికి, సృజనాత్మకతకు పదును పెట్టేలా క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, జాతీయ సమైక్యత వంటి అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా పిజిహెచ్ఎం తాటి సీతారాములు మాట్లాడుతూ... పాఠశాల స్థాయిలో నిర్వహించే ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీతత్వం మరియు దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విజయవంతంగా సాగుతున్న ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.




## స్థానిక సంస్థ ఎన్నికల్లో బి.జె.పి విజయం సాధించాలి.

బి.జె.పి పార్టీ జిల్లా ఇన్చార్జ్ గంగయ్య పిలుపు.




**అనంతగిరి మండలం. ఆగస్టు 13. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ విజయంసాధించాలని ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పార్టీ జిల్లా ఇంచార్జ్ గంగయ్య దిశా నిర్దేశించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం. టోకూరు పంచాయతీ.ములియగూడ గ్రామంలో బి.జె.పి మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాల సోమరాజు అధ్యక్షతన బి.జె.పి శక్తి కేంద్రాల బలోపేతం, ఎన్నికల ప్రణాళికపై గురువారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బి.జె.పి పార్టీ ఇంచార్జ్ గంగయ్య.కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు

**ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ గంగయ్య మాట్లాడుతూ..**

స్థానిక సంస్థల ఎన్నికల దగ్గరపడుతున్న నేపథ్యంలో కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సరించాలని బూత్ స్థాయి నుండి శక్తి కేంద్రాల తయారీ విధానాన్ని పటిష్టం చేస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని. దిశా నిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. బి.జె.పిలో క్రమశిక్షణతో పనిచేసే కార్యకర్తలు ఉన్నత నాయకులుగా ఎదిగే అవకాశం లభిస్తుందని భరోసా ఇచ్చారు. కులమతాలకు అతీతంగా పార్టీ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని స్థానిక సంస్థల ఎన్నికలలో బి.జె.పి పార్టీ విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలొ మండల ఇన్చార్జి డొంబు, మాజీ మండల అధ్యక్షుడు తమన్నా, ప్రధాన కార్యదర్శులు రామస్వామి, రామకృష్ణ, శక్తి కేంద్రాల ప్రముఖులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ అసిస్టెంట్లు మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

## త్రివర్ణ పథకం తో ర్యాలీ ఎంపీడీవో ఫజల్ రహిమాన్



**బేతంచెర్ల:ఆగష్టు 13(ప్రజా జ్యోతి)**బేతంచెర్ల కొత్త బస్టాండ్‌లో గురువారం ఎంపీడీవో ఫజల్ రెహమాన్ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొని మార్గమధ్యంలో ఉన్న ప్రతి ఇంటికి త్రివర్ణ పథకాన్ని ఇచ్చి ఇళ్లపై ఎగర వెయ్యాలని ఎంపీడీవో ఫజల్ రహమాన్ సూచించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ఫజల్ రెహమాన్ మాట్లాడుతూ దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో పంచాయతీ రాజ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి



**ఎమ్మిగనూరు, అగస్ట్ 13(ప్రజా జ్యోతి):** స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంర్ఫ్ ) చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఐదుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.6.60 విలువైన సీఎంర్ఫ్ చెక్కులను అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు, ముఖ్యంగా వైద్య చికిత్సల సమయంలో సీఎంర్ఫ్ ఆర్థిక సహాయం ఎంతో భరోసా కల్పిస్తుందని తెలిపారు.అనారోగ్య సమయంలో ప్రభుత్వం అందించే ఈ సహాయం బాధిత కుటుంబాలకు ఆర్థిక భారాన్ని కొంతమేర తగ్గించడంతో పాటు, కష్టకాలంలో ప్రభుత్వం తమకు అండగా ఉందనే నమ్మకాన్ని కల్పిస్తుందని ఎమ్మెల్యే బీవీ తెలిపారు. లబ్ధిదారులు ఆరోగ్యంగా కోలుకుని సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, ఏఎంసీ చైర్మన్ కే మల్లయ్య, మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబాపురంలో సీపీఐ పాదయాత్ర




**బేతంచెర్ల:ఆగష్టు13(ప్రజా జ్యోతి)** అంబాపురం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పాదయాత్ర నిర్వహించారు. గ్రామ శాఖ కార్యదర్శి నాగేశ్వర అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. రంగనాయుడు, బేతంచెర్ల మండల కార్యదర్శి భార్గవ్, జిల్లా సీనియర్ నాయకులు సంజీవులు, మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, దస్తగిరి పాల్గొన్నారు. అంబాపురం గ్రామ సీపీఐ నాయకులు సోమన్న, శ్రీరాములు, భాస్కర్, సురేష్, రామచంద్రుడు, నాగతిమ్మయ్య, నగేష్, చంద్రమోహన్, నాగాంజనేయులు, బేతంచెర్ల నాయకులు ఉదయ్, మధు, రాముడు, గోపి, ధనుంజయ, నాగరాజు, గౌరీ, ప్రవీణ్, ప్రదీప్, శివ తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు. గ్రామస్తులు, యువకులు, సీపీఐ సానుభూతిపరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## భారత్ గోర్ బంజారా జోడోయాత్రకు గిరిజన సంక్షేమ సంఘం పిలుపు




**కంబదూరు ఆగస్టు 13:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సేవాగఢ్ నుంచి ఆగస్టు 15వ తేదీన ప్రారంభం కానున్న భారత్ గోర్ బంజారా జోడోయాత్రను విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ సంఘం రాయలసీమ జిల్లాల అధ్యక్షులు ఇస్లావత్ సూర్య నాయక్ పిలుపునిచ్చారు.బంజారా గిరిజనుల ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న ఈ జోడోయాత్రకు బంజారా సమాజం నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. సేవాగఢ్‌లో ప్రారంభమయ్యే ఈ యాత్ర ఢిల్లీ వరకు కొనసాగుతుందని బంజారా గిరిజన సమైక్య జాతీయ అధ్యక్షులు ఎస్కే మహేష్ బంజారా ప్రకటించినట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలోని గిరిజనులు, బంజారా యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జోడోయాత్రను విజయవంతం చేయాలని సూర్య నాయక్ కోరారు. బంజారా సమాజం ఐక్యతను చాటిచెప్పే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ద

## పరిశుభ్రత లోపించిన మహా గురుకులం అవస్థలు పడుతున్న విద్యార్థులు



**ప్రజా జ్యోతి -ఆగస్టు 13** మండలంలోని తోట్లపట్ల వద్ద డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో పాఠశాల డైనింగ్ హాలు ఈగలతో నిండిపోయింది.గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి, బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. మల్లేష్, బి.మఠం ఎంపీడీవో రామచంద్రారెడ్డి కలిసి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు.అధికారులు తనిఖీ చేసే సమయానికి విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కానీ డైనింగ్ హాలులో పరిశు భ్రత అస్సలు లేదు. తినే ఆహారం చుట్టూ ఈగలు ముసురుతున్నాయి. పశువుల పాకను తలపించేలా దుర్వాసన, ఈగల మోతతో వాతావరణం కంపు కొడుతోంది.ఈ దృశ్యాన్ని చూసి అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది గురుకులమా లేక నరక కూపమా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రిన్సిపాల్ పరమేశ్వరుడు మరియు సంబంధిత సిబ్బందిని పిలిచి ఎంపీపీ వీరనారాయణరెడ్డి తీవ్రంగా మందలించారు. పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచనలు చేశారు.అనంత రం ఎంపీపీ సంబంధిత జిల్లా అధికారికి ఫోన్ చేసి పాఠశాలలోని దుస్థితిని వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.కోట్లు ఖర్చు పెట్టి కట్టిన భవనంలో విద్యార్థుల ఆరోగ్యం గాలికి వదిలేయడంపై తల్లిదండ్రులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కౌతాళంలో డోర్ టు డోర్ టిడిపి కార్యక్రమం



**కౌతాళం ఆగస్టు 13 ప్రజా జ్యోతి** మంత్రాలయం నియోజకవర్గం ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాలమేరకు మండల అధ్యక్షులు సురేష్ నాయుడు ఆధ్వర్యంలో, క్లస్టర్ -3 వేంకటపతి ఆదేశాలమేరకు మండల కేంద్రమైన కౌతాళంలో గురువారం రోజున డోర్ టు డోర్ ప్రోగ్రామ్ లో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇంటింటికీ తెలుగుదేశం ప్రోగ్రామ్ కార్యక్రమం విజయవంతంగా మొదలైనది.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, ఆ పథకాల లబ్ధి వారికి అందుతున్న తీరును తెలుసుకుంటూ ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషంగా స్పందిస్తూ తమ పూర్తి మద్దతును తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అధ్యక్షులు కురువ వీరేష్, మాజీ ఎంపీటీసీ సౌదరి బసవరాజు,గిరీ, కురువ రమేష్, యూనిట్ ఇంచార్జ్ నబీసాబ్, లింగేశ్, నాగరాజు, శ్రీ రామ్,దివాకర్,మరియు తెదేపా యువనాయకులు పాల్గొన్నారు.

## అనంతగిరి సెగ్మెట్ ఎం.పీ.టీ.సీ పోటీకి మండల బి.జె.పి ఉపాధ్యక్షుడు చిట్టం సింహాద్రి సిద్ధం.



**అనంతగిరి మండలం. ఆగస్టు 13. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బి.జె.పి పార్టీ సిద్ధంగా ఉందని గురువారం నాడు ములియాగూడ గ్రామంలో జరిగిన బి.జె.పి పార్టీ కార్యకర్తల. నాయకుల సమావేశంలో జిల్లా బి.జె.పి పార్టీ ఇన్చార్జ్ గంగయ్య తెలపడంతో అనంతగిరి సెగ్మెట్ నుండి ఎం.పీటీ.సీగా పోటీ చేసేందుకు మండల బి.జె.పి పార్టీ ఉపాధ్యక్షుడు చిట్టం సింహాద్రి సిద్ధంగా ఉన్నట్లు బి.జె.పి వర్గాల నుండి అందినసమాచారం ఈ విషయంపై ప్రజా జ్యోతి దినపత్రిక సింహాద్రినికలిసి వివరణ కోరగా పార్టీ ఆదేశిస్తే ఎం.పీ.టీ.సీ పోటీకి సిద్ధంగా ఉన్నానని కూటమిలో ఉన్నాము గనుక సీట్లు కేటాయింపు బట్టి తప్పక పోటీ ఉంటుందని ఈసారి బి.జె.పి పార్టీ అనంతగిరి సెగ్మెట్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

# కూనవరంలో ఘనంగా 'తిరంగా' బైక్ ర్యాలీ

### టీడీపీ విస్తృత స్థాయి సమావేశం





**కూనవరం ఆగస్టు 13 ప్రజా జ్యోతి కూనవరం:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కూనవరం మండలంలో 'తిరంగా' బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కూనవరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ చైర్మన్ మిరియాల శిరీషాదేవి మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ జెండాలతో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక భాస్కర్ టాకీస్‌లో కూనవరం మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మండల టీడీపీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దృష్టికి తీసుకెళ్లారు. కార్యకర్తల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడాలని ఎమ్మెల్యే సూచించారు.కార్యకర్తల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తానని, కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే శిరీషాదేవి తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.అనంతరం కోతులగుట్ట, తాళ్లగూడెం గ్రామాల్లో 'ఇంటింటా తెలుగుదేశం' కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పొడియం అప్పారావు, మండల ఉపాధ్యక్షులు చెలికాని ఉమామహేశ్వర రావు, జనసేన మండల అధ్యక్షులు దాసరి నరేంద్ర, ఎంపీటీసీ బండారు సాంబ హేమంత్, మాజీ సర్పంచ్, జనసైనికులు, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతం రమేష్, కార్యదర్శులు మడకం చిన్న, బట్టు భాస్కర్, నాచుపల్లి వెంకటేశ్వర్లు, పైదా రాజు, ట్రెజరర్ సోమక సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ తోటకూర వెంకటేశ్వరరావు, ఎస్సీఎల్ అధ్యక్షులు బర్ల నాగరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే సఫీ, తెలుగు రైతు మండల అధ్యక్షులు లంబు వాసు, బీసీ సెల్ అధ్యక్షులు ముక్కలపై నాగరాజు, మండల మహిళా అధ్యక్షురాలు సోడే ధనలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జి మోసం రాము, 4o ఇన్‌చార్జి ఎస్కే రసూల్, యూనిట్ ఇన్‌చార్జిలు చెలికాని వెంకటలక్ష్మి, కుంజా వెంకట్, దాసరి నాగేశ్వరరావు, వీరమల్లు సునీల్, సీనియర్ మాజీ మండల అధ్యక్షులు బరపాటి ప్రకాశరావు మాజీ మండల పార్టీ అధ్యక్షులు గడేసుల ప్రేమచందు నాయకులు నోముల సత్యనారాయణ, గడ్డిపాటి ప్రసాద్, శ్రీమంతుల సతీష్, బండారు శివయ్య, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఇంటి భాస్కరరావు, అరకు పార్లమెంట్ అధ్యక్షులు జిల్లా చిన్నారెడ్డి, అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గాడేసుల రంజిత్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మధు, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ శాఖ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించాలి

### -- ?ఎన్ఆర్ఐ శశి యాదవ్ పిలుపు..

### -- ?చింతలూరులో యాదవ సోదరులతో ప్రత్యేక సమావేశం



**కాకినాడ జిల్లా ఆగస్టు 13 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** శ్రీ కృష్ణాష్టమి వేడుకలను మండలంలోని ప్రతి గ్రామంలోనూ అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే ముమ్మర ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్ఆర్ఐ శశి యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలో చింతలూరు రామాలయం లో గురువారం యాదవ సోదరులు, సంఘం పెద్దలతో ఆయన ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శశి యాదవ్ మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రామాల్లోని శ్రీకృష్ణుడి ఆలయాల వద్ద ఏటా నిర్వహించే ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఈసారి మరింత కోలాహలంగా, పండగ వాతావరణం ఉట్టిపడేలా ప్లాన్ చేయాలని యాదవ పెద్దలను కోరారు."మన పండుగలు కేవలం వేడుకలు మాత్రమే కాదు, మన ఐక్యతకు, సాంప్రదాయాలకు ప్రతీకలు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఈ శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాలను విజయవంతం చేయాలని శశి యాదవ్ కోరారు.ఈ సమావేశంలో గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల నిర్వహణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ పెద్దలు జంకల ఫకీర్ (తాతారావు) లొ0డ లోవరాజు, దాకారపు కృష్ణ, నక్క బద్రి, బర్ల లోవరాజు, పైయాల రాజా, ఓమ్మి కృష్ణ, రోమాల అప్పలరాజు, బురా సత్తిబాబు, గొ0ప గంగరాజు, నక్క బాబ్జి, కు0డల అప్పారావు, దేప రాజబాబు, అల్లు అప్పలరాజు, జంకల నూకరాజు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు

# దేశభక్తి భావాన్ని చాటి చెప్పాలి

### : భారతి, రమేష్ శెట్టి



**ప్రజాజ్యోతి, పోదూరు, ఆగస్టు 13:** జాతీయ పతాకం గౌరవాన్ని, దేశభక్తి భావాన్ని చాటి చెప్పాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కుచ్చర్లపాటి భారతి, బిజెపి మండల అధ్యక్షుడు చింతపల్లి రమేష్ శెట్టి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెద్దలు,, రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు అయినపూడి శ్రీదేవి ఆదేశాల మేరకు చింతపల్లి రమేష్ శెట్టి అధ్యక్షతన జై తిరంగా ర్యాలీ నిర్వహించారు. పోదూరు మండలం భారతీయ జనతా పార్టీ పెద్దలు జాతీయ నాయ అప్ పీఆదేశాలు మేరకు బిజెపి పెద్దలు మనకు నేర్పుతున్న దేశం ముందు-స్వార్థం తరువాత అనే భావనతో ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి గ్రామ గ్రామాన జాతీయ జెండా గౌరవాన్ని దేశ భక్తి భావాన్ని సాటి చెప్పాలి భారత దేశ అభివృద్ధిలో మన వంతు పాత్ర పోషిద్దాం జై తిరంగా ర్యాలీ లో పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతికుచర్ల పాటీ భారతి గారు మండల ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి పెద్దిరాజు గారు మండల ప్రధాన కార్యదర్శి మేడపాటి వెంకట సత్య వర ప్రసాద్ రెడ్డి ఉపాధ్యక్షులు వేంద్ర నరేష్ కుమార్ ఉపాధ్యక్షులు కౌరు నాగబాబు ఉపాధ్యక్షులు కనుమూరి గోపాల కృష్ణం రాజు ఉపాధ్యక్షులు దొమ్మేటి రామాంజనేయులు కార్యదర్శి అనుసూరి వెంకట శెట్టి గారు మామిడి చెట్టు వెంకటేశ్వరరావు కొండేటి సర్వేశ్వర రావు గారు మేడపాటి వెంకట సురేందర్ రెడ్డి కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు వల్లూరు వర ప్రసాద్ మైనారిటీ మోర్చా కుసుమే ఆడమ్స్ వాస గణేష్ గుబ్బల తరుణ్ దీప్ గారు శక్తి కేంద్రం ఇన్చార్ జి కుడుపూడి జయరాజు దొమ్మేటి గిరి మంకు ? కార్యకర్తలు గ్రామాల్లో పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు భారత మాత కి జై వందేమాతరం జై తిరంగా జైహింద్

## మొక్కలను పెంచండి.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




**ఎమ్మిగనూరు, అగస్ట్ 13(ప్రజా జ్యోతి ):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కర్నూలు జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధిలోని మెప్మా కార్యాలయ ఆవరణలో పొదుపు సంఘాల మహిళా సభ్యులకు మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 'వనం మనం' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రతి పొదుపు సంఘం మహిళ ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు మానవ మనుగడకు ప్రధాన వనరులని, పట్టణాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి జి. మురళి, సీఎంఎం జయవర్ధన్, సీఓలు రియాజ్, లలిత, అంజనాదేవి, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత

ఎంపీపీ వీర నారాయణరెడ్డి , ఎంపీడీవో రామచంద్రారెడ్డి




**బ్రహ్మంగారిమఠం-ప్రజా జ్యోతి ఆగస్టు 13** మండల కేంద్రం లోని భావితరాలకు ఉన్నత భవిష్యత్ అందించేందుకు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం అందరి బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ వీర నారాయణరెడ్డి,ఎంపీడీవో రామచంద్రారెడ్డిలు పిలుపునిచ్చారు. మంగళవారం బుధవారము గురువారము మూడు రోజుల పాటు ఎంపీడీవో ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలములో స్వచ్ఛభారత్ మిషన్ లో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహనా, శిక్షణ కార్యక్రమము నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీర నారాయణరెడ్డి ,ఎంపీడీవో రామచంద్రారెడ్డి లు మాట్లాడుతూ గ్రామాల్లో శుభ్రత, పారిశు ధ్యం పై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యకమం లో డిప్యూటీ ఎం పి డి ఓ శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్,మండల పరిషత్ పరిపాలన అధికారి నరసయ్య,పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్,మండల ప్రజా పరిషత్, ఆర్డబ్ల్యూఎస్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## ఎరిగేరి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్షిప్ కబడ్డీ పోటీలకి ఎంపిక.



**కౌతాళం, ఆగస్టు 13 ప్రజా జ్యోతి** అమరావతి ఛాంపియన్షిప్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి యు-17 కబడ్డీ పోటీలకి ప్రవీణ్ మరియు చందఖాన్ ఎంపిక అయ్యారు. ఈనెల 24 నుండి 27వ తేదీల లోజరిగే అమరావతి రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్షిప్ తిరుపతిలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు రాము తెలియపరిచారు, అదేవిధంగా విద్యార్థులను ఎంపీక కావడం చాలా ఆనందంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు,విద్యా కమిటీ చైర్మన్ శ్రీ రాములు,గ్రామ పెద్దలు బసవరాజు, రామలింగప్ప, చంద్రశేఖర్ గిడ్డయ్య, మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించడం జరిగింది.

# మై టిడిపి యాప్ వినియోగంలో ఉత్తమ ప్రతిభ.. హెచ్ రవిని అభినందించిన ఎమ్మెల్యే

## కూనవరంలో కూటమి బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహణ
## సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే శిరీషాదేవి సమీక్ష





**కూనవరం: ఆగస్టు 13. ప్రజా జ్యోతి** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలంలో జాతీయ జెండాలతో కూటమి బైక్ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత కూనవరం పీహెచ్‌సీని ఎమ్మెల్యే సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది ఖాళీలను పరిశీలించి, వాటిని తక్షణమే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో పూర్తిస్థాయిలో భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కూనవరం ఫంక్షన్ హాల్‌లో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే శిరీషాదేవి దిశానిర్దేశం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. మై టీడీపీ యాప్‌లో ఉత్తమ ప్రతిభకు ప్రశంస కూనవరం మండలంలో మై టీడీపీ యాప్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలు, చిత్రాలను చిత్రీకరించి పార్టీ డాష్‌బోర్డుకు చేరవేసిన ఎచ్చు రవికి ప్రత్యేక అభినందనలు లభించాయి. ఆయన కనబరిచిన ఉత్తమ ప్రతిభకు నారా లోకేష్ ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఎచ్చు రవిని శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. డోర్ టు డోర్ ప్రచారం.. అధికారులతో సమీక్ష తదుపరి డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా జగ్గవరం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కోతులగుట్ట సచివాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలు, స్థానిక సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేగులపాడు, తాళ్లగొమ్ము ప్రాంతాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు సంక్షేమం భవిష్యత్తుకు భరోసా

ప్రతి ఇంటికి ప్రగతి సందేశం విజయం పై ఆలూరు అబ్జర్వర్ ఆదినారాయణ బూత్ కన్వీనర్ లకు సన్మానం





**హాలహర్వి ఆగస్టు 13, ప్రజా జ్యోతి:-** కూటమి ప్రభుత్వం అభివృద్ధి ,సంక్షేమ విజయాలు రెండు ఏళ్ల నమ్మకం పై హాల హర్వి మండల కేంద్రములో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోని నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆలూరు నియోజకవర్గం అబ్జర్వర్ తలారి ఆదినా రాయణ పాల్గొని ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలు కూటమి ప్రభుత్వం పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం- సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఎన్టీఆర్ భరోసా వృద్ధాప్య పెన్షన్ 4 వేలు , వికలాంగుల పెన్షన్ 6 వేలు నుంచి,10 వేలు, 15 వేలు వరకు అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం, దీపం -2 ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, శ్రీ శక్తి మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ ప్రతి రైతుకు ఏట 20 వేల రూపాయలు కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. హాలహర్వి లో ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల గురించి వివరించి అక్కడ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బూత్ కన్వీనర్లకు సన్మానం: బూత్ లలో ప్రతి ఇంటికి ప్రభుత్వ ప్రగతి సంక్షేమ కార్యక్రమాల సందేశాన్ని చేరవేస్తూ పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారి కృషి అభినందనీయం. క్రమశిక్షణ సమన్వయం అంకితభావంతో 100% లక్ష్యాన్ని సాధించిన అలాగే యూనిట్లలో 85% చేసిన వారికి అబ్జర్వర్ ఆదినారాయణ సన్మానం చేయడం జరిగింది. నియోజకవర్గం లో ముందుగా వున్నారు. ఇంకా బాగా చేసి మీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి కి మంచి పేరు తీసుకురావాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీధర్, క్లస్టర్ ప్రహ్లాద్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ లు మారుతి, బోగేటప్ప, గాది, సీనియర్ నాయకులు, బూత్ ఇంచార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏ లినోవా ప్రభావం కారణంగా కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

-- సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య




**కూనవరం ఆగస్టు 13, ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలం జరిగిన సమావేశానికి పాయం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మొత్తాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం ఏలినోవ ప్రభావం కారణంగా వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వరి పంట పండించడం రైతులకు కష్టంగా మారిందని ఆయన అన్నారు. తగిన వర్షాలు లేక వ్యవసాయంపై ఆధారపడిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున కూనవరం మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కరువు మండలంగా ప్రకటించి ప్రతి కుటుంబానికి నెలకు రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వీబీ-గ్రాంజి పథకం కింద ప్రతి కుటుంబానికి అదనంగా మరో 100 రోజుల ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యామ్నాయ వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకు ఎరువుల, వ్యవసాయ పనిముట్లు ఉచితంగా ప్రభుత్వమే పంపిణీ చేయాలి , కేవలం ఆన్‌లైన్ విధానాన్ని మాత్రమే అమలు చేయకుండా, గతంలో మాదిరిగానే ఆధార్ కార్డు ఆధారంగా ఎరువులు పంపిణీ చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు కారణంగా అనేక భూములకు సంబంధించిన పట్టా పాస్‌బుక్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సాధ్యం కావడం లేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో తాతలు, తండ్రుల చనిపోయిన వారి పేర్లతో ఉన్న పట్టాలు, పాస్‌బుక్కులు కలిగిన రైతులు ఆన్‌లైన్ విధానంలో ఎరువులు పొందలేని పరిస్థితి ఉందన్నారు. కాబట్టి ఏజెన్సీ ప్రాంత రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, గతంలో మాదిరిగానే ఆర్బీకే కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు ఎరువులు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మడకం నాగమణి, మండల కమిటీ సభ్యులు పాయం సత్యనారాయణ, తెల్ల తమ్మయ్య మడకం జోగయ్య వీక కన్నయ్య తొండ లక్ష్మయ్య జెట్టి సత్యనారాయణ సోడే శ్రీరాములు మడకం సత్యనారాయణ మడకం రమేష్ బొడ్డు బజార్ తదితరులు పాల్గొన్నారు

# కర్నూలుకు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి సభకు బాపురం నుండి బయలు దేరిన వైసీపీ మండల సెక్రెటరీ గుర్నాథ్ రెడ్డి



**కౌతాళం, ఆగస్టు 13 ప్రజా జ్యోతి** మంత్రాలయం నియోజక వర్గం శాసన సభ్యులు అయినటి వంటి వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం రోజున జగనన్న కర్నూల్ పర్యటన సందర్భంగా వైసీపీ మండల సెక్రెటరీ గురునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బాపురం దోమ్మలదిన్నె, విరలదీన్నే,వైసీపీ నాయకులు,కార్యకర్తలు మీటింగ్ కి బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ జైపాల్ మరియు ఆ మూడు గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# కర్నూలుకు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి సభకు ఏరిగేరి నుండి బయలు దేరిన వైసీపీ నాయకులు



**కౌతాళం, ఆగస్టు 13 ప్రజా జ్యోతి** మంత్రాలయం నియోజక వర్గం శాసన సభ్యులు అయినటి వంటి వై.బాలనాగిరెడ్డి మరియు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం రోజున జగనన్న కర్నూల్ పర్యటన సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకులు నీలకంఠ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గోవింద్ మరియు వైసీపీ నాయకులు,కార్యకర్తలు మీటింగ్ కి బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్.. రూ.5 కోట్లు లాస్

**హైదరాబాద్ :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్‌స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్‌ఎమ్‌డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్‌డీ డిపాజిట్‌ను జప్తు చేసింది. ప్రీ-లాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్‌నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కోకాపేట నియోపోలిస్ భూముల వేలంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేలంలో రికార్డు స్థాయిలో భారీ బిడ్ వేసి ప్లాట్‌ను దక్కించుకున్న వజ్రా కన్‌స్ట్రక్షన్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్ణీత గడువులోగా నిధులు చెల్లించలేక చేతులెత్తేసింది. దీంతో వేలం నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ.. హెచ్‌ఎండీఏ సదరు నిర్మాణ సంస్థ భద్రతా డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్ల అర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఓఆ)ని జప్తు చేసింది. కోకాపేట ప్లాట్ నంబర్ 17లోని 4.59 ఎకరాల భూమికి వజ్రా కన్‌స్ట్రక్షన్స్ ఎకరాకు ఏకంగా రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ దాఖలు చేసి భూములు దక్కించుకుంది. ఈ లెక్కన ఆ భూమి మొత్తం విలువ రూ. 626 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే, భూమి కొనుగోలుకు అవసరమైన పూర్తి ఆర్థిక ఇన్వెస్ట్‌మెంట్ సొంతంగా లేనప్పటికీ.. ప్రాజెక్టు ప్రకటించి ప్రీ-లాంచ్, ఓపెన్ టు పబ్లిక్ విక్రయాల ద్వారా కొనుగోలుదారుల నుంచి ముందస్తుగా నిధులు సమీకరించి ప్రభుత్వానికి చెల్లించవచ్చని ఆ సంస్థ భావించింది. అయితే మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రీ-లాంచ్ విక్రయాలు జరగకపోవడంతో ఆ వ్యూహం ఫలించలేదు. నిర్ణీత గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవటంతో రూ. 5 కోట్ల డిపాజిట్‌ను హెచ్‌ఎండీఐ జప్తు చేసింది. ఫలితంగా వజ్రా కన్‌స్ట్రక్షన్స్ రూ. 600 కోట్లకు పైగా విలువైన కోకాపేట స్థలంతో పాటు రూ. 5 కోట్ల నగదును కోల్పోయి రెండు రకాలుగా నష్టాన్ని మూటగట్టుకుంది. భవిష్యత్ ప్రాజెక్టు విక్రయాలను నమ్ముకొని ఆర్థిక సామర్థ్యానికి మించి బిడ్లు వేయడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేస్తోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. చెల్లింపులు జరగని నేపథ్యంలో ప్లాట్ నంబర్ 17

# విజయవంతంగా ముగిసిన 'జ్ఞాన జ్యోతి ' శిక్షణ కార్యక్రమం



**దువ్వూరు,ఆగస్టు13 ( ప్రజా జ్యోతి )** దువ్వూరు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారి అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉద్దేశించిన "జ్ఞానజ్యోతి" అంగన్వాడీ టీచర్ల శిక్షణ కార్యక్రమం గురువారం మూడోవ రోజుకు చేరుకుంది. ముఖ్య అతిథులగా విద్యాశాఖ అధికారి రమణయ్య,చాపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ ముంతాజ్ బేగం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అవుల శ్రీనివాసులు ,కెఆర్పి వరలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు చిన్నారుల ప్రాథమిక విద్య, భాషా వికాసం, మానసిక--శారీరక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. శిక్షణలో అందించే ఆధునిక బోధనా పద్ధతులు, ఆటల ద్వారా అభ్యసనం, చిన్నారుల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను అంగన్వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామం లోని ప్రతి అంగన్వాడీ టీచర్ ఆ గ్రామంలో ఉన్నటువంటి తల్లిదండ్రులకు అందరికీ వారి పిల్లల యొక్క భవిష్యత్తు ఎలా ఉంటుంది అనేది తల్లిదండ్రులకు అందరికీ అవగాహన కల్పించడం అంగన్వాడీ టీచర్ల యొక్క బాధ్యత అని తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న అంగన్వాడీ టీచర్లకు శిక్షణ బృందం ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ, ప్రాక్టికల్ కార్యకలాపాలు మరియు వినూత్న బోధనా పద్ధతులపై శిక్షణ అందిస్తున్నారు. చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే "జ్ఞానజ్యోతి" శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 భాస్కర్,డిఆర్పీలు సుబ్బారెడ్డి, విజయ భాస్కర్,రమేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సౌజన్య, కళావతి, వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు మూడవ రోజు విజయవంతంగా శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకోవడం జరిగిందని తెలిపారు.

# దువ్వూరులో...పండగలా 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం



**దువ్వూరు,ఆగస్టు 13 ( ప్రజా జ్యోతి )** 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' పేరుతో నిర్వహిస్తున్న 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం గురువారం దువ్వూరు మండల కేంద్రంలోని 28 పోలింగ్ బూత్ పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పట్టణ అధ్యక్షులు పాపినేని రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గడిచిన రెండేళ్లలో కూటమి సర్కార్ అందించిన ప్రగతి కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం,స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం,దీపం-2 ఉచిత గ్యాస్,అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మరియు మత్స్యకార వికాసం ద్వారా చేకూరిన ప్రయోజనాలను ప్రజలకు వివరంగా వెల్లడించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ విస్తృత ప్రచారం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో కోనేటి హరి, పెంచికల పాటి వెంకట సుబ్బయ్య,శెట్టి నాగరాజు,అందె శ్రీను,అర్ధాకుల వీరయ్య, గడ్డం ప్రసాద్,జెర్రి ప్రసాద్, ఆశీర్వాదం,రమేష్,సునీల్ మరియు మైనారిటీ నాయకులు బందే ఖాన్, బాష మొద్దీన్, సయ్యద్ బాష,గుళ్లకుంట ఖాదర్,అర్షద్ పాల్గొన్నారు.

# బద్వేల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి ఇంచార్జ్ సూర్యనారాయణ రెడ్డి




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగష్టు 13 (ప్రజా జ్యోతి)** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బద్వేల్ మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం "హర్ ఘర్ తిరంగా" బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ , డీసీసీబీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ బద్వేల్ పట్టణంలోని ప్రధాన పురవీధుల మీదుగా కొనసాగింది. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం యొక్క సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో,స్పెషల్ ఆఫీసర్ ఎ.చంద్ర మోహన్ , బద్వేల్ మున్సిపల్ కమీషనర్ యం.కృష్ణ,తహసీల్దార్ తిరుమల బాబు, మున్సిపల్ మేనేజర్ బి. హరనాథ్ , ఇతర శాఖల ఉన్నత అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## విబ్ జి రామ్ జి పథకం కింద ఎకో పాండ్ మరియు

# వెదురు సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి

**ప్రభుత్వం నిర్ధారించిన 9 వరి రకాలను వేసిన రైతులు రిజిస్ట్రీ చేసుకునేలా రైతు వేదికల ద్వారా తెలియజేయాలి**

**పంటల ప్రస్తుత స్థితిగతులతో మంత్రి ఆరా**

**డిపార్ట్ మెంట్ల వారిగా ఆస్థులు మరియు భూముల వివరాలు ప్రభుత్వానికి అందించాలి**

**నకిలీ డిఏపి తయారుచేసిన వారిపై కఠిన చర్యలు.. 8 మందిపై కేసులు, 6 గురు అరెస్ట్**

**మార్కెట్లలో ఆర్ డి వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి : మార్కెటింగ్ డైరెక్టర్ కు ఆదేశం**



సచివాలయంలో తన శాఖ పరిధిలోని వివిధ శాఖలు, సంస్థల ఉన్నతాధికారులతో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా మంత్రి సమీక్షించారు. పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని, రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విబ్ జి రామ్ జి కింద ఎకో పాండ్లు మరియు వెదురు సాగు చేపట్టేలా పంచాయతీరాజ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సెక్రటరీని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ధారించిన 9 వరి రకాలను సాగు చేసిన రైతులు, ఎఈఓ ల దగ్గర రిజిస్ట్రీ చేసుకునే విధంగా రైతువేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రస్తుత పంట పరిస్థితులపై మంత్రి ఆరా తీశారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ఇప్పటివరకు రైతులకు సబ్సిడీపై ఎన్ని వ్యవసాయ యంత్రాలు అందించారనే వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యంత్రాల పంపిణీలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రైతులకు సేవలందించేందుకు అవసరమైన మేరకు ఉద్యోగులను భర్తీ చేసుకోవాలని, అవసరమైతే ఇతర శాఖల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది కొరతను కారణంగా చూపించే పరిస్థితి ఉండకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రతి పైసాను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.

మార్క్‌ఫెడ్‌కు మంజూరైన 65 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణాలను వరి అధికంగా పండించే జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని మంత్రి సూచించారు. ఉద్యోగుల హాజరుపై రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అన్ని శాఖల్లో అమలు చేసి, ప్రతి ఉద్యోగి హాజరును అందులో నమోదు చేయాలని ఆదేశించారు. విధులకు ఆలస్యంగా వచ్చే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఒకే తరహా విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే అవకాశాలను పరిశీలించాలని వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్‌ను మంత్రి ఆదేశించారు. దీనివల్ల పరిపాలనా వ్యవస్థ మరింత సరళంగా మారడంతో పాటు పర్యవేక్షణ సమర్థవంతంగా ఉంటుందని అన్నారు.

**ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో వేగం పెంచాలి**

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. నర్సరీల్లో మిగిలిపోయిన మొక్కలను వెంటనే విక్రయించి, వచ్చే నెలకు కొత్త మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ఎక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంటే ఆ జిల్లాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు మొక్కలు లేవనే సమాధానం రాకూడదని, రెండు మూడు రోజుల్లోనే వారికి మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నర్సరీలు లక్ష్యం కంటే రెండింతల మొక్కలను పెంచాలని, ఖర్చు ఎంతైనా నాణ్యమైన విత్తనాలను సమకూర్చి అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన మొక్కలను రైతులకు అందించాలని ఆదేశించారు. సంవత్సరానికి 2 లక్షల ఎకరాలు లక్ష్యం పెట్టుకొని అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అన్ని శాఖల వద్ద ఉన్న భూములు, ఆస్తుల వివరాలను తెప్పించుకుని, నర్సరీలకు భూమి అవసరమైతే ఇతర శాఖల ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సెక్రటరీని ఆదేశించారు. డ్రిప్ కంపెనీలతో మాట్లాడి ఆయిల్‌పామ్ కంపెనీలే రైతులకు నేరుగా డ్రిప్ వ్యవస్థలను ఏర్పాటు చేసేలా చూడాలని సూచించారు.

ఆయిల్‌పామ్ మిల్లుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ట్రయల్ రన్స్ ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన గడువులు పూర్తయిన తర్వాత కూడా పనులు కొనసాగుతున్నాయని చెప్పడం సరికాదన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాకు కనీసం ఒక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతుల్లో మరింత ఉత్సాహం కలుగుతుందని అన్నారు. హైదరాబాద్‌లోని విజయ ఆయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మిడ్‌డే మీల్స్ కార్యక్రమాలకు అవసరమైన కూరగాయలను ఆయా ప్రాంతాల్లోని రైతుల నుంచే కొనుగోలు చేసేలా, అలాగే వంట నూనెగా విజయ ఆయిల్‌ను వినియోగించే అంశంపై హరేకృష్ణ చారిటీ ట్రస్ట్ ప్రతినిధులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు.

**నకిలీ డీఏపీపై కఠిన చర్యలు**

నకిలీ డీఏపీ తయారీకి సంబంధించి 8 మందిపై కేసులు నమోదు చేసి, 6 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని మంత్రి తుమ్మల ఆదేశించారు. నకిలీ డీఏపీ ఎంతమేరకు, ఎవరెవరికి విక్రయించారో పూర్తి వివరాలు సేకరించి, నష్టపోయిన రైతులకు సంబంధిత వ్యక్తుల నుంచే పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# అత్యుత్తమ దానం - అవయవ దానం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళి మోహన్

**మహబూబాబాద్ :** జిల్లా కోర్టు సముదాయంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో 'ప్రపంచ అవయవ దాన దినోత్సవం' సందర్భంగా గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి శ్రీమతి షాలిని షాకెల్లి అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు సంస్థ చైర్మన్ కె. మురళి మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ? న్యాయ మూర్తి మాట్లాడుతూ.. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి తోడు పడవోయ్' అన్న గురజాడ మాటలకు నిలువెత్తు నిదర్శనం అవయవ దానమని, ఒకరి చిన్న త్యాగం మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు."బ్రెయిన్ డెడ్ (మస్తిష్క మరణం) పొందిన వ్యక్తుల కుటుంబ సభ్యులు ధైర్యంతో ముందుకు వచ్చి అవయవ దానానికి అంగీకరిస్తే, ఎంతోమంది నిరాశలో ఉన్న బాధితులకు నూతన జీవితాన్ని అందించవచ్చని తెలిపారు.? అవయవ దానం పట్ల సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, అపోహలను తొలగించి, ప్రతి ఒక్కరూ దీనిపై విస్తృత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.? 'మానవ అవయవాల మార్పిడి చట్టం' మరియు అవయవ దాన నమోదు ప్రక్రియపై న్యాయపరమైన అంశాలను వివరించారు. అననంతరం అవయవ దానం ద్వారా కాలేయ మార్పిడి జరిగినటువంటి గ్రహీత పరకాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అవయవాల కోసం ఎదురు చూసే వారికి జీవన్ దాన్ సంస్థ వరం లాంటిదాన్నారు. హైదరాబాద్ లోని నిమ్స్ కేంద్రంగా ఇది పనిచేస్తుండగా అవయవం అవసరమైన వారు జీవన్ దాన్ పోర్టల్ లో




నమోదు చేసుకోవాలని తెలియచేశారు. అనంతరం న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ..పుట్టుక నీది చావు నీది, బ్రతుకంతా సమాజానిది' అన్న కాళోజీ మాటలను స్పూర్తిగా తీసుకోవాలని బ్రతికి ఉన్నంత కాలం సమాజానికి సేవ చేయడమే కాక, మరణానంతరం కూడా తన అవయవాల ద్వారా మరొకరి శరీరంలో జీవాన్ని నిలపడం కంటే పెద్ద సమాజ సేవ మరొకటి ఉండదన్నారు.ఈ సందర్భంగా అవయవ దానం, నేత్ర దానం మరియు శరీర దానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సమ్మతి పత్రాలను పూరించి అందించిన ఉదార స్వభావులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేకంగా అభినందించారు. వారి సామాజిక బాధ్యతను, దేశభక్తిని కొనియాడుతూ వారికి 'జాతీయ జెండా'ను ప్రశంసా పూర్వకంగా అందజేసి సత్కరించారు.?ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీమతి స్వాతి మురారి , అర్వపల్లి కృష్ణతేజ్, కోర్ట్ సిబ్బంది, సమన్వయ అధికారి,కోర్టు విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్స్, పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు

# జేబీపీ పోరాటంతో డీపీఆర్ టెండర్ రద్దు

**టెండర్ రద్దుతో చేతులు దులుపుకోవడం కాదు.**

**.అవినీతి మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**ప్రజా పోరాటాలకు ఎవరైనా తలవంచాల్సిందే**

**జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

**పాల్వంచ :** కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి,అక్రమాలకు వ్యతిరేకంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నిరంతర ప్రజా పోరాటానికి మరోసారి విజయం లభించిందని ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు.జైభీమ్ రావ్ భారత్ పార్టీ పోరాటం నేపథ్యంలో డీపీఆర్ టెండర్‌ను రద్దు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.పాల్వంచ ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో యెర్రా కామేష్ మాట్లాడుతూ..ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, పారదర్శక తకు తావులేకుండా వ్యవహరిస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలపై న్యాయబద్ధంగా, నిరంతరం పోరాటం చేస్తే చివరకు అధికార యంత్రాంగం కూడా ప్రజల డిమాండ్లకు తలవంచాల్సిందేనని అన్నారు."డీపీఆర్ టెండర్ రద్దు చేయడంతో సమస్య పూర్తయినట్లు అధికారులు



భావించకూడదని",టెండర్ ప్రక్రియలో అవినీతి,అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేవలం "టెండర్ రద్దు చేసి చేతులు దులుపుకోవడం ప్రజలను మోసం చేయడమే" అని యెర్రా కామేష్ వ్యాఖ్యానించారు.కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే ఏ ప్రయత్నాన్నైనా జైభీమ్ రావ్ భారత్ పార్టీ అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు.టెండర్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలని,నిబంధనలను ఉల్లంఘించిన అధికారుల పాత్రపై విచారణ జరిపించాలని,ఇప్పటికే డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్,తెలంగాణ విజిలెన్స్ కమిషనర్ కు పిర్యాదు చేయడం జరిగిందన్నారు.ప్రజా సమస్యలపై జేబీపీ పోరాటం ఇక్కడితో ఆగదని యెర్రా కామేష్ తెలిపారు.కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలు, ప్రజా నిధుల దుర్వినియోగంపై పార్టీ నిరంతరం నిఘా ఉంచుతుందని అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని యెర్రా కామేష్ స్పష్టం చేశారు,డీపీఆర్ టెండర్ రద్దు ప్రజా పోరాటానికి వచ్చిన ప్రాథమిక విజయమేనని,అయితే అసలు బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే పూర్తి న్యాయం జరుగుతుందని అన్నారు.ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,పాల్వంచ,కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు నిట్టా నర్సింహ,శంకర్ తదితరులు పాల్గొన్నారు

## ఇప్పపెంటలో నిమ్మ మొక్కల నాటే కార్యక్రమం




**చింతకొమ్మదిన్నె, ప్రజాజ్యోతి ఆగస్టు 13:** చింతకొమ్మదిన్నె మండలం ఇప్పపెంట గ్రామ పంచాయతీలో వైబీజీఆర్ఏఎమ్‌జీ పథకం ద్వారా నిమ్మ మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. షేక్ రహమతుల్లా పొలంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని చింతకొమ్మదిన్నె మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.ఎం. కుళ్లాయిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిమ్మ మొక్కల పెంపకం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పథకం సహాయ ప్రాజెక్టు అధికారి రామాంజులరెడ్డి, ఈసీ అన్నానాయక్, సాంకేతిక సహాయకులు వసంత, ఉపాధి క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## 'సర్'ను పకడ్బందీగా నిర్వహించాలి

**- ఈఆర్వో మధుసూదన్ రావు**



**దువ్వూరు,ఆగస్టు13 ( ప్రజా జ్యోతి )** ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేసే నోటీసులు, విచారణలు, పత్రాల పరిశీలన, పరిష్కార ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని మైదుకూరు ఈఆర్వో మధు సూదన్ రావు సూచించారు. గురువారం దువ్వూరు తహసీల్దార్ కార్యక్రమంలో సర్ నోటీసులు పక్రియను పరిశీలించారు. ఈ సందర్బంగా వారు నోటీసుల తయారీ,పంపిణీ, విచారణ తేదీల నిర్ణయం,పరిష్కారంపై పలు సూచనలు ఇచ్చారు.మండల వ్యాప్తంగా 4,150 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రతి దశను జాగ్రత్తగా నిర్వహిస్తూ, అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అలాగే ఈ ఓటర్ల నోటీసులు సెప్టెంబర్ 21వరకు ప్రక్రియ ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దువ్వూరు, మైదుకూరు తహసీల్దార్లు సునీత,రాజసింహ నరేంద్ర,ఎంపీడీఓ జవహర్ బాబు,డిటి నాగ స్వరూప్,డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా పప్పుప్పల లక్ష్మణ్ నియామకం

**కష్టపడే కార్యకర్తకు గుర్తింపుగా అభివర్ణన**



**తాళ్లపూడి, ఆగస్టు 13, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పప్పుప్పల లక్ష్మణ్ (నాని) ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగానియమించారు.పార్టీ బలోపేతానికి నాని చేసిన కృషిని, త్యాగాన్ని గుర్తించి ఈ బాధ్యతలుఅప్పగించిన అధిష్టానం. వైసీపీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు ఇది ఒక స్ఫూర్తిదాయకమైన అంశంగా నిలిచింది. నియామకం అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ యువతను పార్టీ వైపు నడిపిస్తానని అన్నారు.ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలులక్ష్మణ్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు

## డీలిమిటేషన్ కు తమిళనాడు

## క్లియర్

**చెన్నై :** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై తమిళనాడు శాసనసభ అత్యంత ప్రాధాన్యత కలిగిన తీర్మానాన్ని ఆమోదించింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే స్థానాల సంఖ్యను పెంచితే దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుందనే ఆందోళనలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మూడు స్పష్టమైన డిమాండ్లను సభ ముందుకు తెచ్చి ఏకగ్రీవంగా ఆమోదింపజేసింది.తీర్మానంలో పొందుపరిచిన ప్రధాన ప్రతిపాదనల ప్రకారం? ప్రస్తుతం అమల్లో ఉన్న 1971 జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల కేటాయింపు నిష్పత్తిని యథాతథంగా కొనసాగించాలి. ఒకవేళ అనివార్య కారణాల వల్ల స్థానాల సంఖ్యను పెంచాల్సి వస్తే, ఆ పెంపును కూడా 1971 నాటి జనాభా నిష్పత్తి ప్రకారమే చేపట్టాలి. జనాభా నియంత్రణ , సామాజిక-ఆర్థిక అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు తమిళనాడుతో పాటు ఇతర దక్షిణ భారత రాష్ట్రాలను శిక్షించేలా పార్లమెంటరీ స్థానాల సంఖ్యను తగ్గించకూడదనేది మరో కీలక డిమాండ్.అంటే, మూడింటిలో ఏ డిమాండ్ చూసినా.. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య శాతాన్ని భవిష్యత్తు పునర్విభజనలోనూ ఖచ్చితంగా కాపాడాలనేదే తమిళనాడు ప్రభుత్వ స్పష్టమైన వైఖరి. ప్రస్తుతం ఉన్న స్థానాల నిష్పత్తిని యథాతథంగా కొనసాగించడం లేదా లోక్‌సభ స్థానాలు పెరిగినా.. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆయా రాష్ట్రాలకు ఎంత శాతంలో ప్రాతినిధ్యం ఉందో అదే శాతాన్ని కొనసాగించేలా పెంపు నిర్ణయించాలని స్పష్టం చేస్తోంది.కేంద్ర ప్రభుత్వం కూడా భవిష్యత్తులో స్థానాల పెంపు ఏ విధంగా ఉన్నప్పటికీ దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా సమతుల్యత పాటిస్తామని చెబుతోంది. అందుకే ఈ తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే డెలిమిటేషన్ ప్రక్రియలో జనాభా నియంత్రణ సాధించిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగబద్ధమైన హామీలు, రక్షణలు కల్పించాలని తమిళనాడు అసెంబ్లీ ద్వారా కేంద్రానికి గట్టి సందేశం పంపారు

# బిజినెస్

## నూతన చైర్మన్ కోసం టాటా ట్రస్ట్ ప్రయత్నాలు




**ముంబై, ఆగస్టు 13 :** టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేయడంతో ఈ స్థానంలో నూతన వ్యక్తి కోసం టాటా ట్రస్ట్ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. చంద్రశేఖరన్ పునర్నియామకానికి తన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించకూడదన్న నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్టు సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ పేర్కొంది. ఆయన సారథ్యంలో టాటా గ్రూపునకు చెందిన అన్ని సంస్థలు రాణించాయని ఒక ప్రకటనలో వెల్లడించింది.

## మిధానీకి జీఈ ఏరోస్పేస్ ఎస్400



**మలక్‌పేట, ఆగస్టు 13 :** ప్రభుత్వరంగ సంస్థ మిధానీ మరో ఘనత సాధించింది. విస్తృత శ్రేణి రసాయన, యాంత్రిక, లోహ శాస్త్ర పరీక్షల కోజం జీఈ ఏరోస్పేస్ నుంచి స్వతంత్ర, అంతర్జాతీయ లోహ పదార్థ ప్రయోగశాల(ఎస్400) ఆమోదాన్ని పొందిన దేశంలో తొలి సంస్థ మిధానీ నిలిచిందని కంపెనీ ఫైనాన్స్ డైరెక్టర్ కే మధుబాల తెలిపారు. లోహ పదార్థాల పరీక్ష, అర్హతలో నాణ్యత, సాంకేతిక నైపుణ్యం, ప్రపంచ ప్రమాణాల పట్ల మా అచంచలమైన నిబద్ధతను ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు ప్రతిబింబిస్తున్నదన్నారు. ఈ విజయం ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు విశ్వసనీయ భాగస్వామిగా మిధానీ స్థానాన్ని మరింత బలపర్చనున్నదన్నారు. అధునాతన పదార్థాల రంగంలో ఆత్మనిర్భరత దిశగా మరో ముందడుగుగా ఇది నిలువనున్నదని చెప్పారు. మాపై విశ్వాసం ఉంచి, సహకరించిన జీఈ ఏరోస్పేస్‌కు మిధానీ తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆమె అన్నారు. అంకితభావంతో పనిచేసి ఈ విజయాన్ని సాధ్యం చేసిన మా బృంద సభ్యుల నైపుణ్యం, నిబద్ధతకు అభినందనలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఈ ఏరోస్పేస్ ప్రతినిధి చంద్రశేఖర్ యవర్నసాగర్ జవాలే, మిధానీ ప్రొడక్షన్, మార్కెటింగ్ డైరెక్టర్ పీ బాబు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# వాణిజ్యలోటు కలవరం

### జూలై నెలలో 31.98 బిలియన్ డాలర్లు
### ఆరు నెలల గరిష్ఠానికి చేరుకున్న లోటు




**న్యూఢిల్లీ :** దేశీయ ఎగుమతులు భారీగా పుంజుకుంటున్నాయి. గత నెలలో 44.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో అయిన ఎగుమతులతో పోలిస్తే 19.6 శాతం చొప్పున పెరిగాయి. ఇదే సమయంలో భారత్ 76.22 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 17.52 శాతం అధికమయ్యాయి. దీంతో వాణిజ్యలోటు (ఎగుమతులు–దిగుమతుల మధ్య వ్యత్యాసం) ఆరు నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. గత నెలలో వాణిజ్యలోటు 31.98 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. పెట్రోలియం ఉత్పత్తులు అధికంగా దిగుమతి చేసుకోవడం వల్లనే వాణిజ్యలోటు పెరిగిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఒక జూలై నెలలోనే 18.31 బిలియన్ డాలర్ల విలువైన క్రూడాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకున్నది. కిందటేడాదితో పోలిస్తే ఇది 17.64 శాతం అధికం.

**పసిడి దిగుమతులు**

అతి విలువైన లోహాల దిగుమతులను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచడంతో వీటి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో పసిడి దిగుమతులు కేవలం 4.77 శాతం పెరిగి 4.16 బిలియన్ డాలర్లకు చేరుకోగా, వెండి దిగుమతులు 66 శాతం తగ్గి 171.68 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మే 13 నుంచి అమల్లోకి వచ్చేలా ఈ రెండు లోహాలపై సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు గోల్డ్ దిగుమతులు 32.41 శాతం ఎగబాకి 15.17 బిలియన్ డాలర్లకు చేరుకోగా, వెండి దిగుమతులు 50.81 శాతం తగ్గి 718.42 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దేశంలోకి వస్తున్న బంగారంలో 40 శాతం స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి అవుతున్నదని, అలాగే యూఏఈ నుంచి 16 శాతం, దక్షిణాఫ్రికా నుంచి 10 శాతం చొప్పున వస్తున్నది. జూలై నెలలో స్విట్జర్లాండ్ నుంచి 2 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతి అయింది. చైనా తర్వాత అత్యధికంగా బంగారం వినియోగిస్తున్న భారత్‌లో ఆభరణాలకు ఎనలేని డిమాండ్ ఉన్నది.

**పశ్చిమాసియా దేశాలకు ఎగుమతుల్లో వృద్ధి**

పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం చూపలేదు. గత నెలలో పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి 5.7 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో అయిన ఎగుమతులతో పోలిస్తే ఇది 8.62 శాతం అధికం. ప్రధానంగా పెట్రోలియం, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 67 శాతం అధికమయ్యాయని రాజేశ్ అగర్వాల్ తెలిపారు. యూఏఈకి 10 శాతం పెరుగగా, సౌదీ అరేబియాకు 2.73 శాతం తగ్గాయి.

**క్రూడాయిల్ ధరలు పెరుగడం వల్లనే..**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గత నెలలో బ్యారెల్ క్రూడాయిల్ ధరలు 72 డాలర్ల నుంచి 95 డాలర్లకు చేరుకోవడంతో భారత్ అధికంగా చెల్లించాల్సి వచ్చింది. దీంతో వాణిజ్యలోటు ఆరు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకోవడానికి యుద్ధమే కారణమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మొత్తం దిగుమతుల్లో క్రూడాయిల్ వాటా 24 శాతంగా ఉండటం ఇందుకు కారణం. ఇదే సమయంలో ఎగుమతులు కూడా భారీగా పుంజుకున్నాయి. జూన్ 2022 తర్వాత ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఎగుమతులు జరుగడం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల్లో ఎగుమతులు 17 శాతం ఎగబాకి 173.78 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 19 శాతం అధికమై 292.38 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో వాణిజ్యలోటు 118.60 బిలియన్ డాలర్లు. ముడి పత్తి, పప్పుదినుసులు, ఎరువులు, బొగ్గు, కోక్, కెమికల్స్, ప్రాజెక్ట్ గూడ్స్, గోల్డ్, ఎలక్ట్రానిక్ వస్తువులను భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకున్నది. ఈ సందర్భంగా వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ..పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్, సముద్రపు ఉత్పత్తుల

## ఇండిగో ఇండిపెండెన్స్ డే ఆఫర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 :** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను తీసుకొచ్చింది. ఈ ఆఫర్ల కింద విమాన టికెట్లపై 20 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నది. ఈ నెల 16 లోపు దేశీయ, అంతర్జాతీయ రూట్లలో బుకింగ్ చేసుకున్న విమాన టికెట్ల బేస్ ధరపై మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు ఈ నెల 16 నుంచి అక్టోబర్ 31 లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చునని తెలిపింది. కస్టమర్ తన ప్రయాణానికి మూడు రోజుల ముందు 'ఇండిగో80' ప్రోమో కోడ్‌తో బుకింగ్ చేసుకోవాల్సి వుంటుందని వెల్లడించింది. ఈ ఆఫర్‌ను కంపెనీ వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్, ఎంపిక చేసిన ట్రావెల్ పార్ట్‌నర్లలో బుకింగ్ చేసుకోవచ్చును.




# బ్రెజిల్ మ్యాచ్ కోసం..
# ఫిఫా ఆసియన్ కప్ నుంచి తప్పుకున్న భారత్

**ఢిల్లీ :** ఈ ఏడాది అక్టోబర్‌లో బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టుతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడేందుకు వేయి కండ్లతో ఎదురుచూస్తున్న భారత్.. అరంగేట్ర ఫిఫా ఆసియన్ (అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్ట్ ఆసియన్ నేషన్స్) కప్ నుంచి వైదొలిగింది. దక్షిణాసియా దేశాల కోసం ఫిఫా తీసుకొచ్చిన ఈ టోర్నీలో ఆడేందుకు తొలుత ఆమోదం తెలిపిన భారత్.. తర్వాత బ్రెజిల్ మ్యాచ్‌తో షెడ్యూల్ క్లాష్ కారణంగా తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. ఫిఫా ఆసియన్ కప్ సెప్టెంబర్ 21న మొదలై అక్టోబర్ 4తో ముగియనుండగా భారత్, బ్రెజిల్ మ్యాచ్ అక్టోబర్ 3న జరగాల్సి ఉంది. టోర్నీ నుంచి తప్పుకున్న నేపథ్యంలో ఏఐఎఫ్ఎఫ్ జనరల్ సెక్రటరీ ఎం. సత్యనారాయణ స్పందిస్తూ.. 'అవును. మేం ఆసియన్ కప్ నుంచి వైదొలిగాం.




షెడ్యూలే ఇందుకు ప్రధాన కారణం. ఏకకాలంలో రెండు మ్యాచ్‌లను ఆడటం కష్టం. ఆసియన్ కప్ ఫైనల్ అక్టోబర్ 4న జరుగుతుంది. కానీ మాకు బ్రెజిల్‌తో అక్టోబర్ 3న మ్యాచ్ ఉంది. బ్రెజిల్‌తో పోరు మాకు అతిపెద్ద అవకాశం. ఆసియన్ కప్‌లో ఉన్న దేశాలతో (సింగపూర్, మలేషియా, ఇండోనేషియా) మేం గతంలో చాలా మ్యాచ్‌లు ఆడాం. భవిష్యత్‌లోనూ ఆడతాం. కానీ బ్రెజిల్‌తో మ్యాచ్ ఆడే అవకాశం ఎప్పుడు వస్తుందో తెలియదు. ప్రపంచంలో ఐదో ర్యాంకులో ఉన్న బ్రెజిల్.. 138వ ర్యాంకు కల్గిన మాతో ఆడేందుకు వస్తుండటం మాకు అతిపెద్ద విషయం. ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ అవకాశాన్ని మేం కోల్పోదలుచుకోలేదు' అని తెలిపాడు.

## ముప్పంతా ఆ ఇద్దరితోనే..
## ప్రభాత్, మెండిస్‌తో భారత్‌కు తిప్పలు

### ఈ స్పిన్ ద్వయానికి గాలెలో తిరుగులేని రికార్డు

**గాలె :** ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తు రేసులో నిలవాలంటే ఇకనుంచి ప్రతి మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో రెండు టెస్టులు ఆడేందుకు శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత జట్టు శనివారం నుంచి ఆతిథ్య జట్టుతో స్పిన్ సమరానికి సిద్ధమవుతున్నది. టీమిండియాతో పోలిస్తే పేపర్‌పై లంక జట్టు బలహీనంగా కనిపిస్తున్నప్పటికీ సొంతగడ్డపై లంకేయులు సింహాల్లా గర్జించగలరు. ఏండ్లుగా తమ అమ్ములపొదిలో దాగిన స్పిన్ అస్త్రంతోనే గిల్ సేనను బోల్తా కొట్టించేందుకు ఆ జట్టు ప్రణాళికలు సిద్ధం చేసింది. ముఖ్యంగా పర్యాటక జట్టుకు లంక స్పిన్ ద్వయం ప్రభాత్ జయసూర్య, రమేశ్ మెండిస్ నుంచి ముప్పు పొంచి ఉంది. మొదటి టెస్టుకు ఆతిథ్యమివ్వనున్న గాలెలో ఈ ఇద్దరికీ తిరుగులేని రికార్డు ఉంది. ప్రత్యర్థి ఎంత మేటి బ్యాటర్ అయినా గాలెలో వీరి ఉచ్చులో చిక్కుకుని బయటపడటం అంత సులభమేమీ కాదన్నది గణాంకాలు చెబుతున్న కఠిన వాస్తవం.

**కింగ్స్ ఆఫ్ గాలె..**

క్రికెట్‌లో కొంతమంది ఆటగాళ్లకు ఎంతో ఇష్టమైన, తాము అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేసే స్టేడియాలు కొన్ని ఉంటాయి. మిగతా వేదికల కంటే అక్కడ వారు మరింత మెరుగ్గా రాణించగలరు. సచిన్‌కు వాంఖెడే, కోహ్లీకి అడిలైడ్ (ఆస్ట్రేలియా), దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్‌కు కొలంబో మాదిరిగా ప్రస్తుత లంక జట్టులో ఉన్న జయసూర్య, మెండిస్‌కు గాలె వెరీ వెరీ స్పెషల్. ఈ ఇద్దరూ కలిసి ఇక్కడ 23 మ్యాచ్‌లు ఆడి ఏకంగా 145 వికెట్లు పడగొట్టారంటే అక్కడ వీరి ఆధిపత్యం ఏ రేంజ్‌లో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. లెఫ్టార్మ్ స్పిన్నర్ జయసూర్య 11 టెస్టుల్లోనే 81 వికెట్లు తీస్తే ఆఫ్ స్పిన్నర్ మెండిస్ 12 మ్యాచుల్లో 64 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఇద్దరినీ నిలువరించడం భారత బ్యాటర్లకు శక్తికి మించిన పనే. గాలి అధికంగా వీచే గాలెలో దానిని సద్వినియోగం చేసుకుని




ఫ్లైటెడ్ డెలివరీలతో బ్యాటర్లను బుట్టలో వేసుకోవడంలో ప్రభాత్ సిద్ధహస్తుడు. జట్టు సహచరులు 'కింగ్ ఆఫ్ గాలె'గా పిలుచుకునే అతడి స్పిన్ తంత్రాన్ని ఛేదించి పరుగులు రాబట్టాలంటే గిల్ అండ్ కో. చెమటోడ్చాల్సిందే.

**ఆ మచ్చను తుడిచేస్తారా?**

ఒకప్పుడు భారత బ్యాటర్లు స్పిన్ ఆడటంలో ఆరితేరినవారు. స్వదేశంలో స్పిన్‌తోనే ప్రత్యర్థిని దెబ్బకొట్టి ఆ తర్వాత అపోజిషన్ బౌలర్ల (ముఖ్యంగా స్పిన్నర్ల)ను చీల్చిచెండాడటంలో టీమిండియాకు ఘనమైన రికార్డు ఉండేది. షేన్ వార్న్, మురళీధరన్ వంటి దిగ్గజ స్పిన్నర్లను ద్రావిడ్, సచిన్, లక్ష్మణ్, సెహ్వాగ్ వంటి బ్యాటర్లు నిలువరించి సెంచరీల మీద సెంచరీలు కొట్టారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నం. సొంతగడ్డపై 2024లో న్యూజిలాండ్ కొట్టిన చావుదెబ్బ నుంచి తేరుకోకముందే నిరుడు దక్షిణాఫ్రికా సైతం భారత్‌ను వైట్‌వాష్ చేయడం జట్టుకు కోలుకోలేని దెబ్బ. కివీస్ లెఫ్టార్మ్ స్పిన్నర్లు అజాజ్ పటేల్, మిచెల్ శాంట్నర్ నాటి రోహిత్ సేనకు చుక్కలు చూపిస్తే 2025లో సౌతాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ సిమోన్ హర్మర్ దెబ్బకు ఆకాశంలో విహరించిన టీమిండియాను అమాంతం నేలకు దించాడు. ఇక ఇప్పుడు ప్రభాత్ కూడా లెఫ్మార్మ్ స్పిన్నరే. భారత బ్యాటర్ల బలహీనతే అతడి బలం. అతడికి తోడు రమేశ్ కూడా మరో ఎండ్‌లో దాడి చేయనుండటంతో రెండువైపులా భారత్‌కు ముప్పు తప్పదు. ప్రస్తుతం ఉన్న జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు తప్ప మిగిలిన బ్యాటర్లను ఇక్కడ ఆడిన అనుభవం లేకపోవడం భారత్‌కు ప్రతికూలాంశం. కానీ ఈ స్పిన్ ద్వయం నుంచి ఎదురయ్యే ముప్పును దాటితేనే సిరీస్‌లో భారత విజయావకాశాలు మెరుగుపడతాయి. మరి గిల్ సేన ఏం చేస్తుందనేది ఆసక్తికరం.

# స్పోర్ట్స్

## కంగారూలకు ఝులక్..
## తొలి ఇన్నింగ్స్‌లో 198 ఆలౌట్

### హసన్‌కు ఆరు వికెట్లు




**డార్విన్ :** 'ఈ టెస్టు మూడు రోజుల్లోనే ముగుస్తుందా? లేక ఐదు రోజులు సాగుతుందా?' ఆస్ట్రేలియాలో టెస్టు మ్యాచ్ ఆడేందుకు వచ్చిన బంగ్లాదేశ్ సారథి నజ్ముల్ హొసేన్‌కు ఫస్ట్ టెస్టు ప్రారంభానికి ముందు విలేకరుల నుంచి ఎదురైన ప్రశ్న ఇది. కట్ చేస్తే.. డార్విన్ వేదికగా గురువారం ఆరంభమైన ఫస్ట్ టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాకు బంగ్లా పేసర్లు ఊహించని షాకిచ్చారు. పిచ్‌పై ఉన్న పచ్చిక, స్థానిక వాతావరణ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బంతితో చెలరేగి కంగారూలను 198 రన్స్‌కే కుప్పకూల్చారు. యువ పేసర్ హసన్ మహ్మూద్ (6/55) కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేయగా ఎబాదత్ (2/39), టస్కిన్ అహ్మద్ (2/55) తలా రెండు వికెట్లు పడగొట్టారు. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 71) టాప్ స్కోరర్. ఆసీస్ టాపార్డర్‌లో ట్రావిస్ హెడ్ (22), వెదరాల్డ్ (23), కామెరూన్ గ్రీన్ (13), మార్నస్ లబూషేన్ (1) బంగ్లా పేసర్ల ధాటికి తేలిపోయారు. లంచ్ విరామానికే 74/4తో నిలిచిన ఆతిథ్య జట్టును స్మిత్, క్యారీ (19) నిలబెట్టే యత్నం చేశారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 56 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించే పనిలో ఉండగా ఎబాదత్.. క్యారీని పెవిలియన్‌కు పంపి కంగారూలకు కళ్లెం వేశాడు. ఆ తర్వాత వచ్చిన లోయరార్డర్ కూడా చేతులెత్తేసింది. కాగా బంగ్లాదేశ్‌తో టెస్టుల్లో ఆస్ట్రేలియాకు ఇదే అత్యల్ప స్కోరు. గతంలో మీర్పూర్ (2017లో) టెస్టులో 217 రన్స్ చేయడమే ఇప్పటిదాకా అత్యల్పం. ఆసీస్‌ను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసిన బంగ్లా.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చి నిలకడగా ఆడుతున్నది. ఆసీస్ బ్యాటర్లు విఫలమైన పిచ్‌పై తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు ఒక వికెట్ నష్టానికి 96 రన్స్ చేసింది. తాంజిద్ (32 బ్యాటింగ్ ), మోమినుల్ (35 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.




# బాక్సాఫీస్ వద్ద బిగ్ ఫైట్

**ఇండిపెండెన్స్ డే కానుకగా ఒకే రోజు థియేటర్లలోకి ఏడు చిత్రాలు!**

ఇండిపెండెన్స్ డే లాంగ్ వీకెండ్ సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునేందుకు టాలీవుడ్‌లో ఎన్నడూ లేని విధంగా భారీ పోటీ నెలకొంది. బాక్సాఫీస్ రేసులో నిలిచేందుకు పెద్ద సినిమాల నుంచి చిన్న చిత్రాల వరకు ఏకంగా 7 సినిమాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఒకే తేదీని టార్గెట్ చేస్తూ ఇన్ని సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కేటాయింపు, అడ్వాన్స్ బుకింగ్స్ మరియు కలెక్షన్ల పరంగా తీవ్రమైన పోటీ తలెత్తింది. ఇక ఇందులో తెలుగులోనే 5 సినిమాలు రాబోతుండగా హిందీ నుంచి రెండు సినిమాలు విడుదల కాబోతున్నాయి.

**విశ్వనాథ్ అండ్ సన్స్ :** తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం విశ్వనాథ్ అండ్ సన్స్. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మమిత బైజు కథనాయికగా నటిస్తుండగా రాధిక శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించబోతుంది. ఈ చిత్రంపై అటు తమిళంతో పాటు ఇటు తెలుగులో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే కరుప్పు సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న సూర్య ఈ సినిమాతో మరో హిట్టు కొడతాడని అభిమానులు అంచనాలు వేస్తున్నారు.

**అగధ :** టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రాబోతున్న చిత్రం ఇది. మిస్టిక్ హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ అంటూ రాబోతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఈ సినిమాపై కూడా టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

**మకుటం :** కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ తొలిసారిగా మెగాఫోన్ పట్టి తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'మకుటం'. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్ బ్యానర్‌పై 99వ ప్రాజెక్ట్‌గా ఇది వస్తోంది. ఇందులో విశాల్ భిన్నమైన మూడు పాత్రల్లో విశ్వరూపం చూపించనున్నారు. విశాల్, అంజలి కాంబినేషన్‌కు ఉండే క్రేజ్ ఈ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

**పల్లాబురుసు :** గ్రామీణ తెలంగాణ నేపథ్యంలో సాగే ఒక సరికొత్త ఫ్యామిలీ కామెడీ-డ్రామా చిత్రం ఇది. సాధారణమైన ఒక వృద్ధ తండ్రి తన కొడుకుపై పోలీస్ స్టేషన్‌లో చిన్న కారణం (టూత్‌బ్రష్ కొనివ్వలేదని) నిమిత్తం కంప్లైంట్ ఇవ్వడం వంటి విభిన్నమైన పాయింట్‌తో ఈ కథ నడుస్తుంది. తండ్రీకొడుకుల మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగాలు, అహం, మారుతున్న సామాజిక విలువలను కళ్లకు కట్టేలా ఈ చిత్రాన్ని దర్శకుడు ఎమోషనల్ అండ్ ఎంటర్‌టైనింగ్ వేలో తెరకెక్కించారు. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించాడు. అన్నపూర్ణ స్టూడియోస్ ఒ ఎపిక్ స్టూడియోస్ నిర్మించాయి.

హుషార్ పిట్టలు : వాసవి గణేషన్, అన్ష్, సునితా మనోహర్, అంజి వల్గుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు భిక్షు దర్శకత్వం వహించాడు. పూర్తిగా యూత్‌ఫుల్, లవ్ మరియు ఫ్రెండ్‌షిప్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో రూపొందిన చిత్రం ఇది. నేటి యువత ఆలోచనలు, వారి జీవితంలోని సరదా క్షణాలు, ప్రేమ మరియు అనుబంధాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. బాక్సాఫీస్ వద్ద కాలేజ్ గోయర్స్ మరియు యూత్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ ఈ సినిమా రూపొందింది.

**ఆవారాపన్ 2 :** ఇమ్రాన్ హష్మీ, దిశా పటాని, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సంచలన విజయం సాధించిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న క్రేజీ యాక్షన్ ఎమోషనల్ డ్రామా ఇది. 'శివమ్' పాత్ర మరోసారి క్రైమ్ ప్రపంచంలోకి అడుగుపెట్టి, ప్రేమ, ప్రతీకారం, త్యాగం మరియు విముక్తి కోసం సాగించే అన్?షణ దీని ప్రధాన కథాంశం.






# మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను

'ఇందులో నా పాత్ర పేరు మహాదేవి. దేవుని అనుగ్రహంతో పుట్టే పాత్ర అది. నా ప్రిన్సిపల్స్ పక్కన పెట్టి మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను. బుద్ధిజం పుస్తకాల్ని చదివాను' అన్నారు నటి కామాక్షి భాస్కర్ల. ఆమె ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'అగధ'. శ్రవణ్‌రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్ కీలక పాత్రధారులు. ఎమ్మెస్ రాజు దర్శకుడు. ఈ నెల 14న విడుదల కానున్నది. గురువారం హైదరాబాద్‌లో కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. 'ఎమ్మెస్ రాజుగారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఒకే చెప్పాను. కానీ ఎమ్మెస్ రాజుగారు కూర్చోబెట్టి కథ చెప్పి, నాపాత్రను వివరించారు. నిజంగా కథ, నా పాత్ర మనస్ఫూర్తిగా నచ్చాయి. ఇది కేవలం హారర్ థ్రిల్లర్ మాత్రమే కాదు. డివైన్ మూమెంట్స్ కూడా ఇందులో బలంగా ఉంటాయి. టెక్నికల్‌గా కూడా సినిమా అద్భుతంగా ఉంటుంది' అని తెలిపింది కామాక్షి భాస్కర్ల.

# యువతలో మార్పు తెస్తుంది



అన్ష్, వాసవి గణేషన్ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషార్ పిట్టలు'. భిక్షు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రుద్రకాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించింది ప్రీమియర్‌షోస్‌కి కూడా మంచి రెస్పాన్స్ వస్తున్నది. వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలున్న కథ ఇది. చరణ్ అర్జున్ మ్యూజిక్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. నేటి యువతకు చక్కటి సందేశాన్ని అందించే చిత్రమిదని, హిట్ పక్కా అని హీరో అన్ష్ నమ్మకం వ్యక్తం చేశారు. ఒక జనరేషన్‌లో మార్పుతెచ్చే సినిమా ఇదని కథానాయిక వాసవి గణేషన్ చెప్పింది. ఈ చిత్రానికి కెమెరా: రుద్రసాయి, సంగీతం: చరణ్‌అర్జున్, దర్శకత్వం: భిక్షు.

# విషపూరిత బంధాన్ని తెంచుకున్నా



వ్యక్తిగత విషయాలను ఎక్కువశాతం చాలామంది గోప్యంగానే ఉంచుతారు. బహిర్గతం చేసుకోరు. కానీ అందుకు భిన్నమైన వ్యక్తిత్వం నటి అనుపమ పరమేశ్వరన్‌ది. తన అనుభవాలు ఇతరులకు హెచ్చరికలా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నిర్మొహమాటంగా మనసును ఆవిష్కరించారామె. 'ప్రేమ పేరుతో ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం నా జీవితంలోకి వచ్చాడు. పరిచయమైన మూడు నెలలకే నిశ్చితార్థం, వివాహం అంటూ బలవంతపెట్టడం మొదలుపెట్టాడు. ఆ తొందరపాటులో ప్రేమకంటే నన్ను నియంత్రించాలనే ఆత్రమే ఎక్కువ కనిపించేది. నేను ధరించే దుస్తులు, సోషల్ మీడియాలో నేను పెట్టే పోస్టులు, చివరికి నేను ఎంచుకునే సినిమాల విషయంలో కూడా ఆంక్షలు విధించడం మొదలుపెట్టాడు. అసలు నటనకే నన్ను దూరం చేయాలని చూశాడు. దాంతో స్వేచ్ఛకు దూరమై మానసికంగా నలిగిపోయాను. కేరవాన్‌లో ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఒక్కోసారి అతని ప్రవర్తన భయం కలిగించేది. ఈ ఆందోళన వల్ల బరువు తగ్గిపోయాను. నా కెరీర్‌లోనే అతి పెద్ద విజయమైన 'డ్రాగన్' సినిమా ప్రమోషన్స్‌కి నేను హాజరు కాకపోవడానికి కారణం కూడా అతనే. అందుకే ఆ విషపూరిత బంధాన్ని అతికష్టం మీద తెంచుకున్నా. ప్రస్తుతం ఆ మానసిక గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది అనుపమ. అయితే ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమె వెల్లడించలేదు. అగ్రహీరో విక్రమ్ తనయుడు ధృవ్‌తో ఆమె కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నట్లు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఇంటర్వ్యూలో అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,